Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 27.01.2017, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 34 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## తమిళ తంబిల స్ఫూర్తితో...

# ఉద్యమానికి ఊపిరి!



తెలుగుజాతి మనది... నిండుగ వెలుగుజాతి మనది... అంటూ ఎంతో గర్వంగా పాడుకుంటుంటాం! 'తెలుగువీర లేవరా.. దీక్షబూని సాగరా...' అంటూ అల్లూరి సీతారామరాజు సినిమాలోని పాటను తెగ వింటుంటాం. 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని శ్రీ కృష్ణదేవరాయలు చెప్పాడని పదేపదే చెప్పుకుంటుంటాం. తెలుగు ఆత్మగౌరవం, తెలుగు పౌరుషం గురించి పలు మార్లు గుర్తు చేసుకుంటుంటాం... ఇదంతా చరిత్ర! తెలుగు ఆత్మగౌరవం, తెలుగు పౌరుషం రాష్ట్ర విభజన సమయంలోనే కనిపించకుండా పోయాయి.


- తమిళుల సమైక్యతను చూసి తల దించుకుంటున్న ఆంధ్రులు
- 'సుప్రీం' వ్యతిరేకించిన జల్లికట్టును సాధించుకున్న తమిళులు
- చట్టబద్ధమైన ప్రత్యేకహోదాను సాధించుకోలేని తెలుగుబిడ్డలు
- తెలుగు ఆత్మగౌరవం, పౌరుషం ఎటుపోయింది...?

దేశ చరిత్రలోనే అత్యంత అన్యాయంగా, దుర్మార్గంగా, కిరాతకంగా ఒక ప్రాంతానికి ద్రోహంచేసేలా, ఒక ప్రాంతం ప్రజలు నష్టపోయేలా రాష్ట్ర విభజన చేస్తుంటే, కనీసం ఆ అన్యాయాన్ని ప్రశ్నించలేకపోయాం. ఎదిరించ లేకపోయాం, నిలువరించలేక పోయాం. ఇది మా సమస్య కాదన్నట్లు మిన్నకుండిపోయాం. ఆ నష్టం మాకు జరగదన్నట్లు తాపీగా ఉండిపోయాం.

ఆంధ్రప్రదేశ్ విభజనను అడ్డుకోలేకపోయినప్పుడే, కనీసం దానిని అడ్డుకునే ప్రయత్నం చేయలేకపోయినప్పుడే స్వర్గీయ ఎన్టీఆర్ తట్టి లేపిన ఆంధ్రుల ఆత్మగౌరవం తిరిగి ఢిల్లీ పాలకుల పాదాల వద్ద తాకట్టు పెట్టబడిందనే విషయం అర్థమైపోయింది. పౌరుషం, రోషం అంటే తెలంగాణ నాయకులది, ప్రజలది. రాదు, సాధ్యం కాదు అన్న తెలంగాణ రాష్ట్రాన్ని వాళ్లు సాధించుకున్నారు. తెలంగాణ నాయకులు ప్రజల్లో నుండి వచ్చినవాళ్లు. ప్రజల నాడి తెలిసినవాళ్లు. అందుకే తెలంగాణ కోసం ప్రజలతో కలసి రోడ్లమీద నిలబడ్డారు. ఢిల్లీ పెద్దల మెడలు వంచి (మిగతా 11వ పేజీలో)

## • దండగ ఖర్చు దావోస్...

# పిలవని పేరంటం




దావోస్‌లో జరిగిన సదస్సుకు ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు వెళ్లినట్లు? ఈ సదస్సులో ఆయా దేశాల ప్రతినిధులు లేదా దేశాధి నేతలు పాల్గొంటారు. చంద్రబాబు ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి. ఈయనకు ఆ సదస్సులో ఏం పని? అలాగని దావోస్ నుండి ఆయనకు ఆహ్వానం అందితే వెళ్లారా అంటే అదీకాదు. (మిగతా 11వ పేజీలో)

## మినిస్టర్...



# డోంట్ కేర్!

- నారాయణను లెక్కచేయని అజీజ్
- మేయర్ దెబ్బకు హడలెత్తుతున్న మంత్రి

పిల్లోడు కదా అని చంకలెత్తుకుంటే, చొక్కా అంతా తడిపాడంట... మున్సిపల్ మంత్రి నారాయణ పరిస్థితి అలాగే ఉంది. రాష్ట్ర మంత్రివర్గంలో నారాయణకు శక్తివంతమైన మంత్రి అని పేరుంది. ముఖ్యమంత్రి చంద్రబాబుకు నమ్మినబంటు. మంత్రివర్గంలో నారాయణ మాటకు తిరుగులేదు. ఆయన మాటకు చంద్రబాబు కూడా ఎదురుచెప్పడు. పార్టీలోని సీనియర్, జూనియర్ నాయకులందరు ఈ విషయం తెలిసి నారాయణకు ఎంతో ప్రాధాన్యతనిస్తున్నారు. ఇక సొంత జిల్లా నెల్లూరులో చూస్తే కొమ్ములు తిరిగిన నాయకులు ఆనం సోదరులు. వాళ్లే నారాయణ వద్దకు పోతున్నారు. ఒకప్పుడు ఆనం సోదరుల ముందు నారాయణ బచ్చా! ఇప్పుడు అదే నారాయణతో ఆనం వాళ్లు కలిసి నడవాల్సి వస్తోంది. (మిగతా 11వ పేజీలో)



# బాధిత కుటుంబాలకు బాసటగా నిలుస్తాం

## - నెల్లూరుజిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ





విధి నిర్వహణలో మృతి చెందిన బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని నెల్లూరుజిల్లా ఎస్పీ విశాల్ గున్నీ తెలిపారు. గత ఏడాది జూలైలో నెల్లూరుజిల్లా మనుబోలు మండలం కాగితాలపూడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో హోంగార్డు శ్రీహరి మృతి చెందాడు. అతని కుటుంబాన్ని ఆదుకునేందుకు జిల్లాలోని హోంగార్డులు తమ ఒక్కరోజు వేతనాన్ని రూ. 2,29,200, సెంట్రల్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ. 20వేలు చెక్కుల రూపంలో ఇవ్వగా, సోమవారం ఎస్పీ విశాల్‌గున్నీ మృతిచెందిన శ్రీహరి భార్య జయంతికి అందజేశారు. నెల్లూరు హోంగార్డు యూనిట్‌లో పనిచేస్తున్న కె. శ్రీనివాసమూర్తి ఇటీవల పదవీ విరమణ పొందారు. దీంతో హోంగార్డులందరూ తమ ఒక్కరోజు వేతనాన్ని రూ. 2,20,800లు ఇచ్చారు. దానిని చెక్కురూపంలో ఎస్పీ శ్రీనివాసమూర్తికి అందజేశారు. హోంగార్డ్స్ డిఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావు, ఆర్ఐ కేజీఎం చిరంజీవి, సీనియర్ మహిళా సహాయకురాలు షేక్ ఖతీజాబేగం తదితరులు పాల్గొన్నారు.

# మట్టిలో కలసిపోయే ప్లాస్టిక్‌తో ప్రయోజనం

## - ప్రొఫెసర్ ఏ.వరదరాజులు




మట్టిలో కలసిపోయే ప్లాస్టిక్ పదార్థాలు మానవాళికి ఎంతో ఉపయోగకరమని, అలాంటి పదార్థాలను రూపొందించడం చాలా అవసరమని మధురై సమీపంలోని కృష్ణన్ కోయిల్‌లో వున్న కలశలింగం విశ్వవిద్యాలయం విజిటింగ్ ప్రొఫెసర్ ఆచార్య ఏ.వరదరాజులు అన్నారు. నెల్లూరులోని విఆర్‌కళాశాల ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఎస్ఏ రామమూర్తి మరియు డాక్టర్ సి. రమేష్‌కుమార్ స్మారక ఉపన్యాస కార్యక్రమంలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. మట్టిలో కలసిపోయే పాలిమర్లు, నానో మిశ్రమ పదార్థాలు అనే అంశంపై ఆయన మాట్లాడుతూ, మనం అనాదిగా వినియోగిస్తున్న పసుపు, వేప, తులసి వంటి పదార్థాలను ప్లాస్టిక్‌లతో కలిపి మిశ్రమ పదార్థాలను తొలిసారిగా


సింహపురి సమాచారం

తయారుచేశామని, అవి యాంటీబయోటిక్ లక్షణాలు కలిగివున్నాయని, కనుక వైద్య రంగంలో శస్త్రచికిత్సల సమయంలో వైద్యులు వాడే అప్రాన్‌లుగాను, బ్యాండేజీలుగాను వాడుకోవచ్చన్నారు. అదే విధంగా, ఉపయోగించిన టీపొడి, కోడి గుడ్ల పెంకులు, కొబ్బరిపీచు, తాటి పీచు, చింతపండు నార, పట్టుదారాలు, పత్తి వంటి వాటిని ఉపయోగించి దృఢమైన మిశ్రమ ప్లాస్టిక్ పదార్థాలను తయారు చేశామని, వాటిని రక్షణరంగంలోనూ ఉపయోగించకోవచ్చని వివరించారు. అంతరిక్ష పరిశోధనల్లో, స్పేస్ షటిల్స్‌లో అత్యధిక ఉష్ణోగ్రత తట్టుకోవాల్సిన విడి భాగాలలోనూ వీటిని వాడుతున్నారన్నారు. అయితే, క్యారీ బ్యాగ్‌లు, రెజిన్లు, ప్లాస్టిక్ దారాలు వగైరా ప్లాస్టిక్ పదార్థాల వల్ల మంచికన్నా చెడు ఫలితాలు ఎక్కువగా వున్నాయని, అందువల్ల ప్లాస్టిక్స్‌ని పరిమితంగా వాడాలని, వాటిని రీసైక్లింగ్ చేసి అవసరమైతే వాటిని తిరస్కరించాలని పేర్కొన్నారు. అనంతరం ప్రొఫెసర్ వరదరాజులును నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

విఆర్‌సి ప్రిన్సిపాల్ డాక్టర్ సివిఎస్ భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సి.ఇ.ఓ ఐ.సుధాకరరెడ్డి, శాస్త్రవేత్త డాక్టర్ ఏ.జగదీష్, ఫిజిక్స్ విభాగం హెడ్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు డాక్టర్ జి.కృష్ణకిషోర్, బి.వేమారెడ్డి, వివి కృష్ణశర్మ, డాక్టర్ బాబర్, డాక్టర్ రవీంద్ర రెడ్డి, లైబ్రేరియన్ డా. ఎన్.ప్రభాకర్, డాక్టర్ ఎం.పద్మప్రియ, ఎం.గరుడేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యా ర్థులకు ప్రశంసాపత్రాలు, స్కాలర్‌షిప్‌లు మంజూరుచేశారు.

# దుత్తలూరు తహాశీల్దార్‌కు నోటీసులు

నెల్లూరుజిల్లా దుత్తలూరు తహాశీల్దార్ ఎం.ఎస్.శ్రీనివాస్‌ను ఫిబ్రవరి 2వ తేదీ ఆర్టీఐ కమిషనర్ ఎదుట హాజరు కావాలని కమిషనర్ నోటీసులు జారీ చేశారు. దుత్తలూరు మండలంలోని నందిపాడుకు చెందిన ఎన్.వెంకటేశ్వర్లు రెవెన్యూ శాఖకు సంబంధించి సమాచార హక్కు చట్టం ద్వారా కొంత సమాచారాన్ని కోరుతూ దరఖాస్తు చేసుకున్నాడు. అయితే తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని సంబంధిత అధికారులు లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. ఉద్దేశపూర్వకంగానే సమాచారం ఇవ్వలేదని భావించిన అర్జీదారుడు సమాచార హక్కు చట్టం కమిషనర్‌కు అప్పీల్ చేశాడు. దరఖాస్తుదారుడి అప్పీల్‌ను పరిశీలించిన కమిషనర్ ఫిబ్రవరి 2న తన ఎదుట హాజరు కావాల్సిందిగా నోటీసును పంపారు.

# ‘ఉషా’ కృష్ణమూర్తికి ‘బోస్ మ్యాజిక్ అవార్డు’

నెల్లూరీయుడు, తాంత్రిక చక్రవర్తి.. ఇంద్రజాల కళామూర్తి బిరుదాంకితుడైన ఉషా కృష్ణమూర్తికి మ్యాజిక్ రంగంలో ఎంతో విశిష్టమైన ‘బోస్ మ్యాజిక్ అవార్డు -2017’ లభించింది. ఇంద్రజాల విద్యలో సీనియర్ మెజీషియన్లలో అత్యద్భుత ప్రతిభ కనబరచినవారికి ఇచ్చే ఈ ప్రతిష్టాత్మక అవార్డు ఆయనకు లభించడం పట్ల జిల్లా వాసులందరూ ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ మ్యాజిక్ అసోసియేషన్-గుంటూరు వారి ఆధ్వర్యంలో ఈ నెల 22న గుంటూరులో జరిగిన మ్యాజిక్ ఫెస్టివల్‌లో ఆయనకు ఈ అవార్డుతో పాటు, 30వేల నగదును బహూకరించారు. నెల్లూరు ట్రంకురోడ్డులో ఉషా ఫోటో స్టూడియో నిర్వహిస్తూ, అనేకమంది ఔత్సాహిక ఇంద్రజాలికులకు, కళాకారులకు ప్రోత్సాహాన్ని అందిస్తూ ‘ఉషా’ కృష్ణమూర్తిగా ఆయన అందరికీ సుపరిచితులే. వండర్‌బాయ్‌గా, ‘ఉషారు’ కృష్ణమూర్తిగా, ఫన్‌మాస్టర్‌గా ఆయన ఎంతో ప్రఖ్యాతి



చెందారు. దాదాపు వెయ్యికిపైగా ఇంద్రజాల ప్రదర్శనలిచ్చి ఆ రంగంలో ఎనలేని ఖ్యాతినార్జించారు. బెస్ట్ ఫోటోగ్రాఫర్‌గా, బెస్ట్ కెమెడియన్‌గా, ‘ఇంద్రజాల కళామూర్తి’గా ఆయన అందరి ప్రశంసలు అందుకున్నారు. అంతేకాక, కళా-సేవా రంగాల్లోనూ ముందుంటూ ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి, పలు సంస్థల నుంచి ఘనమైన సన్మానాలు కూడా అందుకున్నారు. ఎప్పుడూ నవ్వులు పండిస్తూ అందరికీ చెణుకులు వడ్డిస్తూ..అందరినీ అలరించే ఈ ఇంద్రజాలికునికి ప్రతిష్టాత్మకమైన బోస్ మ్యాజిక్ అవార్డు లభించడం సింహపురి సీమకే గర్వకారణం. నెల్లూరు మ్యాజిక్ రంగానికే ఇది ఎనలేని గుర్తింపని, ఉషా కృష్ణమూర్తికి ఈ అవార్డు రావడం మ్యాజిక్ రంగంలోని వారికి, ఆయన సహచరులు అభిమానులందరికీ ఎంతో సంతోషం కలిగిస్తోందని ఏ.పి మ్యాజిక్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏ.కె రాయలు ఈ సందర్భంగా కళామూర్తి కృష్ణమూర్తికి తన అభినందనలు తెలియజేశారు.



# అగ్రి బాధితులకు అండగా అనిల్

అగ్రిగోల్డ్ ఆస్తుల వేలంను వేగవంతం చేసి బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే డా. అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ వారు చేస్తున్న 2 వ రోజు రిలేదీక్షకు ఆయన తన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ, అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని గత మార్చినెలలో ప్రభుత్వం హామీ ఇచ్చిందని, నెలరోజుల్లో వేలం ప్రక్రియ పూర్తిచేస్తామన్నారని, అయితే ఏడాది గడిచినా కూడా ఇంతవరకు 50 కోట్ల రూపాయలు కూడా వసూలు చేయలేదని అన్నారు. హాయ్‌లాండ్ ద్వారా వచ్చే వెయ్యికోట్లతో 15 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులకు ఉపశమనం కలుగుతుందని, కానీ ఇంతవరకు దానిని ఎందుకు వేలం వేయడం లేదో అర్థం కావడం లేదని విమర్శించారు. కోర్టులు మొట్టికాయలు వేస్తున్నా వేలం ప్రక్రియ నత్తనడకే నడుస్తోందన్నారు. అగ్రిగోల్డ్ ఏజెంట్లు దాదాపు వందమంది మరణించడంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డాయని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. బాధితులకు వైఎస్సార్సీపి అండగా వుంటుందన్నారు. మంత్రి నారాయణ అయినా బాధితులతో చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి సానుకూలత చూపకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే వెయ్యికోట్లు మంజూరుచేసి అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలన్నారు. కార్పొరేటర్లు గోగుల నాగరాజు, ఎం.డి ఖలీల్ అహ్మద్, నాయకులు వేలూరు మహేష్, అధహర్‌బాషా, కాకు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మద్దతు తెలిపిన జిల్లా కాంగ్రెస్...

అగ్రిగోల్డ్ బాధితులకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పనబాక కృష్ణయ్య, పీసీసీ ఉపాధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి, బిసి సెల్ రాష్ట్ర కన్వీనర్ గాలాజు శివాచారి, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ శీలం తిరుపయ్య, మైనార్టీ సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ షేక్ ఆసిఫ్ పాషాలు నిరాహారదీక్ష శిబిరానికి వెళ్ళి తమ సంఘీభావం ప్రకటించారు.



# నేతాజీకి నెల్లూరీయుల వందనం

నేతాజీ సుభాష్ చంద్రబోస్ 120వ జయంతిని పురస్కరించుకుని సోమవారం నెల్లూరు శ్రీనివాస అగ్రహారంలోని శ్రీ నేతాజీ పైలట్ హైస్కూల్లో విద్యార్థులచే దేశ నాయకుల వేషధారణలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎం.వి.సుబ్బారెడ్డి, మనోహర్ రెడ్డి, ఎం.వెంకటాద్రిరెడ్డి, పి.రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వి.ఆర్ కళాశాల మైదానంలో నేతాజీ జయంతి సందర్భంగా విఆర్‌సి వాకర్స్ అధ్యక్షుడు పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఏరియా అధ్యక్షులు ఎం.వి.సుబ్బారెడ్డి, కార్యదర్శి వి.నాగేశ్వరరావు, కోశాధికారి టి.వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రెటరి జె.వెంకటేశ్వర్లు, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్ మండలం కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డులో



నెల్లూరు బాలభవన్ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ 120వ జయంతిని ఘనంగా నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పిల్లలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, ఉపాధ్యాయులు మనోరమ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

# కరువు బృందం.. రానూ వచ్చె.. పోనూ పోయె

## - ఈసారైనా సాయం అందేనా?

జిల్లాలో ఈ ఏడాది తీవ్ర వర్షాభావంతో పంటల పరిస్థితి దయనీయంగా మారింది. నీళ్లు లేక పొలాలు బీళ్ళుపడిపోయాయి. జిల్లాలోని అనేక మండలాల్లోని రైతులు కరువు ప్రభావంతో అల్లాడిపోతున్నారు. పంటలు వేసుకునేందుకు చుక్క నీరు లేక, కొద్దోగొప్పో వేసుకున్న పంటలు నీరులేక ఎండిపోయి ఎటు చూసినా దుర్భిక్షం తాండవిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో అరాకొరా ఎదిగిన పంటలను సైతం ఇక ఆ పైరును ఏమీ చేసుకోలేక పశువులకే వదిలేస్తున్న దృశ్యాలు జిల్లాలో కరువు రక్కసి పడ ఘట్టాలను చెప్పకనే చెప్తున్నాయి. జిల్లాలో 27 మండలాల్లో కరువు పరిస్థితులు తీవ్రంగా వున్నాయని, వర్షాభావంతో పంటలు పండలేదని, సాధారణ వర్ష పాతంలో సగానికి పైగానే లోటు ఏర్పడిందని, 58శాతం వర్షపాతం లోటుతో అనేక మండలాలు గతంలో ఎన్నడూ లేనంతగా కరువు వాతపడ్డాయని జిల్లా ఉన్నతాధికారులు సైతం స్పష్టం చేస్తున్నారు. జిల్లా రైతుల కష్టనష్టాలను పరిశీలించి సత్వరం వారికి తగు సాయం అందించాలని ప్రభుత్వాలకి విన్నవించారు. ఆ మేరకు రాత్రీ పగలు కష్టపడి నివేదికలు కూడా సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్రం నుంచి కరువు బృందం వచ్చి పరిస్థితులను అధ్యయనం చేస్తుందని తెలిసి రైతన్నలు ఆశపడ్డారు. కరువు స్థితిగతులను అంచనా వేసి, రైతాంగానికి తగు సాయం అందించేందుకు కేంద్రం నుంచి ఈ నెల 23న కరువు బృందం వచ్చింది. అయితే, ఆ పర్యటన మాత్రం ‘రానూ వచ్చె..పోనూ పోయె అన్నట్లుగా’ హడావిడిగా జరిగిపోవడంతో రైతన్నలు అవాక్కయ్యారు. కరువు బృందం హడావిడిగా రావడం.. ఉరుకులు పరుగులతో పలు ప్రాంతాల్లో పర్యటించడం..కనిపించిన ఏ ఒకరిద్దరు రైతులతోనే మాట్లాడడం, అధికారులు ఏర్పాటుచేసిన కరువుచిత్రాలను చూడడం.. పరిస్థితినంతా కేంద్రానికి నివేదిక ఇస్తామని చెప్పి వెళ్ళిపోవడం..ఇదీ పర్యటన తీరు. ఇప్పుడే కాదు, ఎప్పుడు కరువు బృందాలు పర్యటించినా ఈ హడావిడిలో పెద్దగా మార్పంటూ ఏమీ వుండదు. అంతదూరం నుంచి వచ్చిన వారు కనీసం రైతులతో సమావేశమయ్యి..నీటి వనరులు ఎలా ఒట్టిపోయాయో, పొలాలు ఎలా ఎండిపోయాయో కళ్ళారా చూసి స్పందించి రైతులను ఆదుకునేందుకు తగు సాయం అందించాలని కేంద్రానికి విన్నవిస్తే బావుండేదని రైతన్నల అభిప్రాయం. అయితే,



కొద్దిగంటల్లోనే ఎంతటి పరిస్థితినైనా అంచనా వేయగల సామర్థ్యం వున్న వారికి ఇవి పెద్దగా లెక్కేమీ కాకపోవచ్చు. కానీ, ఇంతచేసీ సాయం అందితే పర్వాలేదు.. కానీ, మొక్కుబడి పర్యటనల వల్ల ప్రయోజనం ఏముందీ?. ప్రయాణఖర్చులు, తిప్పట దండగే తప్ప ఫలితం శూన్యమే కదా.. అనేది రైతన్నల నిరాశ. జిల్లా ఉన్నతాధికారులు నష్టం నివేదికలు ఇచ్చినా అవి తిరిగి సాయం రూపంలో జిల్లాకు వచ్చేది అంతంతమాత్రమేనన్నది గతంలో మన రైతాంగానికి అనుభవైకవేద్యమే. కరువు లొచ్చినా.. వరదలొచ్చి ముంచినా ఇదిగో వస్తున్నాం..అదిగో సాయం అంటారు కానీ, చివరికి చేతిదాకా వచ్చేది నామమాత్రమే. ఇప్పుడు, జిల్లా రైతాంగం కరువు కోరల్లో చిక్కి విలవిలలాడుతున్నా వారికి ఆ ఛాయలు కన్పించాయో లేదో తెలియదు. నీరు లేక పంటలే వేయని పొలాలు.. వారిలో స్పందన కలిగించాయో లేదో తెలియదు. పంటలు లేక చివరికి ఎండు గడ్డి కూడా దొరక్క మూగజీవాల ఘోష వారికి వినిపించిందో లేదో తెలియదు. పర్యటన మొదలుపెట్టేటప్పటికే మధ్యాహ్నం ఒకటిన్నరైంది. తడ మండలంలోని గ్రద్దగుంట గ్రామానికి వెళ్ళి అక్కడ పది నిమిషాలు ఓ రైతుతో మాట్లాడి, అక్కడినుంచి దొరవారిసత్రం మండలంలోని అక్కరపాక, ఓజిలి చెరువు చూసి, గూడూరు మండలానికి వచ్చి పోటుపాళెం, చెన్నూరుకు వచ్చేటప్పటికే సాయంత్రమైంది. అంతా హడావిడియే. ఆ పుణ్యకాలం కాస్తా అయిపోయాక బృందం ఇక వస్తామంటూ..చక్కా వెళ్ళిపోయింది. ప్రభుత్వ సాయం కోసం కోటికళ్ళతో ఎదురుచూస్తున్న రైతులకు ఇదంతా ఏదో ఒక ప్రహసనంగా జరిగినట్లే అనిపించింది. చివరికి కేంద్రం నుంచి సాయం అందుతుందో.. లేదో?.. వచ్చే పంట కాలం దాకానైనా బతికేందుకు తగ్గ ఆదరువు దొరుకుతుందో లేదో.. అంత దాకా పశుగ్రాసం కూడా దొరక్క తమనే నమ్ముకున్న మూగజీవాలు బతికుంటాయో లేదో...అన్నీ ఆవేదనలే రైతన్నకు. కరువు కోరల్లో చిక్కిన మండలాల్లోని రైతాంగం తమ ఆవేదనను ఎలా చెప్పుకోవాలో తెలియక..దిగులుతో కూలబడివున్నారు. అటు వరుణుడు కరుణించక, ఇటు ప్రభుత్వాలు స్పందించకపోతే తమ దుస్థితి ఏమికావాలంటూ రైతులు, రైతు కుటుంబాలవారు పడుతున్న ఆవేదన వర్ణనాతీతం. ఏదేమైనా గతంలోవలె కాక, ఈ కరువు బృందమైనా కేంద్రానికి పూర్తి స్థాయిలో నష్ట నివేదికలు సమర్పించి, రైతాంగాన్ని కష్టాల నుంచి ఆదుకునేందుకు అన్ని విధాలా సాయం చేస్తుందనే ఆశిద్దాం!

## 'ప్రభా'తం

కాలదోషం పట్టిన బోగీలు..పాతకాలం నాటి పట్టాలు.. ఎప్పుడో పురాతనకాలం నాటి సిగ్నలింగ్ వ్యవస్థ.. మధ్యలో దారంతా పాతబడిపోయి శిథిలావస్తకు చేరుకున్న వంతెనలు...అన్నీ కలిసి వెరసి మన పట్టాలు..మృత్యుపాశాలుగా మారుతున్నాయి. పట్టాలపై ప్రయాణంలో ఎన్నెన్నో ఘోరమైన దుర్ఘటనలు తరచూ జరిగిపోతూనే వున్నాయి. భద్రత కరువై అనేకమంది ప్రయాణీకులు ప్రమాదాలకు బలైపోతూనే వున్నారు. రైలు ప్రమాదాల నివారణకు, ప్రయాణీకుల భద్రతకు వేలాదికోట్లు వెచ్చిస్తూనేవున్నామని, ముఖ్యంగా భద్రతకు అత్యంత పటిష్టమైన చర్యలు తీసుకుంటూనే వున్నామని పాలకులు పదేపదే చెప్పుకుంటూనే వున్నా..ప్రమాదాలు మాత్రం వాటిపాటికవి జరిగిపోతూనే వున్నాయి. ఎంతోమంది ప్రయాణీకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతూనే వున్నాయి. మొన్నటికి మొన్న జగదల్‌పూర్ నుంచి భువనేశ్వర్ వెళ్తున్న హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ విజయనగరం జిల్లా కూనేరు వద్ద పట్టాలు తప్పిన ఘోరదుర్ఘటనలో ఏకంగా 40 మందికి పైగా మృత్యువాత పడడం దారుణం.. దయనీయం.. ఎంతో బాధాకరం. ఈ దుర్ఘటనలో మరో వందమందికి పైగానే గాయాలతో విలవిలలాడుతున్నారు. ఈ ప్రమాదంలో రెండు రిజర్వేషన్ బోగీలు తిరగబడిపోయి, మరోరెండు జనరల్ బోగీలు ఒకదానికొకటి ఢీకొని నుజ్జునుజ్జయిపోయాయి. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి పెనుప్రమాదం జరగకుండా నివారించగలిగినా, పట్టా విరిగిపోవడం వల్ల జరిగిన ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య ఇంత భారీగా వుండడం ఎంతో విషాదకరం. రైలు పట్టా విరిగిపోవడం వల్లనే రైలు ప్రమాదానికి గురైందని, అయితే దీని వెనుక విద్రోహచర్య వుంటుందనే విషయమై నిజానిజాలు తేల్చడానికి దర్యాప్తు బృందం రంగంలోకి దిగింది.

ఇది లావుంటే, ఇటీవల ఓ రెండు నెలల క్రితమే ఇండోర్-పాట్నా ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పి రైలు ప్రమాదానికి గురైంది. 14 బోగీలు పట్టాలు తప్పడం, 150 మంది దాకా ప్రయాణీకులు ప్రాణాలు కోల్పోయిన ఆ దుర్ఘటన ఇంకా మాసిపోకముందే ఇప్పుడు కూనేరు వద్ద జరిగిన దుర్ఘటన అందరికీ విషాదం కలిగిస్తోంది. అందులోనూ కూనేరు రైల్వేస్టేషన్ సమీపంలోనే జరిగిన ఈ ప్రమాదం రైల్వే యంత్రాంగం వైఫల్యాలకు మరో నిదర్శనంగా కనిపిస్తోంది. గత డిసెంబర్‌లో ఉత్తరప్రదేశ్‌లో సెల్దా-అజ్మీర్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పి, 15 బోగీలు వంతెన మీద నుంచి కిందపడిపోవడంతో ఎంతోమంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటనలో ప్రాణనష్టం లేకపోయినా, జరిగిన ఘోరం మాత్రం చిన్నదేమీ కాదు. రైలు ప్రయాణాల్లో ఇలా తరచూ జరుగుతున్న ప్రమాదాలు, సంఘటనలు జరిగినప్పుడు మాత్రం హడావిడి చేయడం, ఆ తర్వాత మృతుల కుటుంబాలను పరామర్శించడం, ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతో తమ పని అయిపోయిందన్నట్లుగా వ్యవహరించడం పాలకులకు అలవాటైపోయింది. ప్రమాదాలకు బలైపోయినవారిని తలచుకుని ఆయా కుటుంబాలు ఎంతగా కుమిలిపోతారో..జీవితాంతం వారు పడే యాతన ఎంత నరకప్రాయంగా వుంటుందో!.. అయినా, ఎవరికీ ఏమీ పట్టదు. ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని కంటితుడుపు మాటలు చెప్తుంటారే తప్ప, ఆచరణకు వచ్చేసరికి మళ్ళీ అంతా మామూలే. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వుంటుంది. గత దశాబ్దకాలంలోని ఘటనలు.. గణాంకాలు పరిశీలించినా దేశంలో జరిగిన రైలు ప్రమాదాల్లో అత్యధికశాతం ప్రమాదాలు రైళ్ళు పట్టాలుతప్పడం వల్ల జరిగినవేనని తెలుస్తోంది. రైలు ప్రయాణానికి ప్రాణప్రదమైన పట్టాలు సరిగా లేకపోవడం, వాటి నిర్వహణ అంతా అస్తుబిస్తుగా వుండడం, పట్టాలు పరిరక్షించుకునేందుకు అవసరమైన సిబ్బంది లేకపోవడం వంటి సమస్యలను ఎంతోకాలంగా నిపుణులు ఘంటాపథంగా చెప్తూనే వున్నప్పటికీ, ఆ సమస్యలను పరిష్కరించే నాథులు మాత్రం వుండడం లేదు. అంతేకాదు, ఎప్పుడో పాతకాలపు నాటి పట్టాలపైనే నేటికీ మన రైళ్ళు ప్రయాణాలు సాగిస్తూండడం, రైళ్ళు ప్రయాణాలు చేసే మార్గాల్లో వున్న అనేక వంతెనలు ఎప్పుడో పాతకాలం నాటివి కావడం, రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోలేకపోవడం వంటివన్నీ ఎంతోకాలంగా వస్తున్న సమస్యలే. ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా రైలు ప్రయాణాల్లో నేటికీ పటిష్టమైన భద్రత లేకపోవడం ఎంతో విచారకరం. రైల్వేల ఆధునీకరణకు, పట్టాలను పటిష్టం చేసేందుకు, ప్రయాణీకుల భద్రతకు ఎంతో కాలం నుంచి ప్రణాళికలు, నిపుణుల కమిటీల సిఫార్సులు వున్నప్పటికీ..అవి ఏళ్ళ తరబడిగా ఆచరణలోకి రాకపోవడంతో ప్రయాణీకుల భద్రత గాల్లో దీపంలాగానే వుంది. రైలుపట్టాల నిర్వహణతో పాటు, రైళ్ళ భద్రతకు సంబంధించి దాదాపు లక్షా యాభైవేలకు పైగానే ఉద్యోగాలు నేటికీ ఎంతోకాలంగా భర్తీకి నోచుకోకపోవడం చూస్తే భద్రత పట్ల మన పాలకుల చిత్తశుద్ధి ఎలావుందో తేటతెల్లమవుతుంది. మరోవైపు, ప్రయాణాల్లో ప్రమాదాలు జరగకుండా నేడు ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆధునిక పరిజ్ఞానం అందుబాటులో వున్నా మనరైల్వే యంత్రాంగం మాత్రం ఇంకా ఆ పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో అందుకోలేకపోతోంది. పెరుగుతున్న ప్రయాణీకులకు తగ్గట్టుగా రైళ్ళసంఖ్య పెరుగుతున్నా.. పట్టాలపై గతంలో లేనంత వత్తిడి పెరుగుతున్నా, పట్టాలు పటిష్టంగా లేకపోవడంతో ప్రయాణీకులకు భద్రత కరువవుతోంది. ప్రపంచంలో అమెరికా, రష్యా, చైనాల తర్వాత నాల్గవస్థానంలో వున్న అతిపెద్ద భారతీయ రైల్వే వ్యవస్థ.. ఇలా భద్రతాపరంగా ఎంతో వెనుకబడిపోతుండడం బాధాకరం. ఇకనైనా ఈ పరిస్థితి మారాలి. గత తొంభైది దశాబ్దాలుగా వస్తున్న ప్రత్యేక రైల్వేబడ్జెట్ విధానానికి స్వస్తి చెప్తూ త్వరలో రాబోతున్న సాధారణ బడ్జెట్‌లో రైల్వేబడ్జెట్ విలీనం కాబోతున్న నేపథ్యంలో, రైల్వే ప్రయాణీకులకు ఇకనైనా పటిష్టమైన భద్రత కల్పించేందుకు కేంద్రం బడ్జెట్‌లో పెద్దపీట వేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

### పట్టాలు తప్పిన ప్రాణాలు



జగదల్‌పూర్ నుంచి భువనేశ్వర్ వెళ్తున్న హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ విజయనగరం జిల్లా కూనేరు వద్ద పట్టాలు తప్పిన ఘోరదుర్ఘటనలో 40 మందికి పైగా మృత్యువాత పడడం ఎంతో విషాదకరం. కాలదోషం పట్టిన బోగీలు.. పాతకాలం నాటి పట్టాలు.. పురాతనకాలం నాటి వంతెనలు... అన్నీ కలసి వెరసి మన పట్టాలు.. మృత్యుపాశాలుగా మారుతున్నాయి. ఇకనైనా ఈ పరిస్థితి మారాలి. రైలు ప్రమాదాల నివారణకు కేంద్రం పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. రానున్న బడ్జెట్‌లో ప్రయాణీకుల భద్రతకు పెద్ద పీట వేయాలి.

---

ప్రపంచాన్ని వెంటాడుతున్న

## ప్లాస్టిక్ భూతాన్ని నిషేధించాలి



ప్రపంచాన్ని వెంటాడుతున్న ప్లాస్టిక్ భూతాన్ని వెంటనే నిషేధించాలని ప్రజా సైన్స్ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పా రామారావు డిమాండ్ చేశారు. ఆదివారం నెల్లూరులోని విజయకుమార్ మెమోరియల్ ట్రస్ట్ ఆసుపత్రి సమావేశ మందిరంలో సైన్స్ వేదిక రాష్ట్ర స్థాయి సమ్మేళనం సందర్భంగా పర్యావరణంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆహారం, రక్షిత నీరు, ఇల్లు, పర్యావరణం, విద్య, ఆరోగ్యం లాంటి సైన్స్ ఫలాలు సామాన్యునికి అందినప్పుడే ఈ సమాజం బాగుపడుతుందన్నారు. గ్లోబల్ వార్మింగ్‌ను అరికడదాం అనే నినాదంతో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సైన్స్ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జి.మాల్యాద్రి అధ్యక్షత వహించిన ఈ సభలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన అతిథులు కడారి ప్రభాకరరావు, ప్రొఫెసర్ డి.వెంకటేశ్వర్లు, రామకృష్ణ, కోయ వెంకటేశ్వర్లు, జగ్గారావు, రాజు, అబ్దుల్‌కలాం, నూనె నారాయణ, గాలి శ్రీనివాసులు, అవ్వారు శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతంతో సంబంధం లేదు...

## మాతృభాషతోనే అనుబంధం

**- మారిషస్ తెలుగు విభాగ అధికార ప్రతినిధి నరసింహ అప్పాడు**



ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్లి మారిషస్‌లో తమ పూర్వీకులు స్థిరపడ్డారని అయినా తమకు ప్రాంతాలతో సంబంధం లేదని, మాతృభాషతోనే అనుబంధమని మారిషస్ తెలుగు విభాగ అధికారప్రతినిధి సంజీవయ్య నరసింహ అప్పాడు పేర్కొన్నారు.

ఆదివారం తన సతీమణితో కలిసి నెల్లూరుజిల్లా పల్లిపాడులోని పినాకిని సత్యాగ్రహ ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. అనంతరం రెడ్‌క్రాస్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన తెలుగు భాషపై విలేకర్లతో మాట్లాడుతూ తెలుగంటే తమ దేశస్తులకు ప్రాణమని, తమ ముత్తాతలు ఆంగ్లేయుల కాలంలో మారిషస్ దేశానికి వలస వెళ్లారని వివరించారు. మా తెలుగుతల్లికి మల్లెపూదండను తాము నిత్యం స్మరిస్తామని తెలిపారు. మారిషస్‌లో ఆంగ్లం, ఫ్రెంచ్‌తో పాటు భారతదేశంలోని మరో భాషను ఖచ్చితంగా నేర్చుకోవాల్సిందేనన్నారు. దివ్యమైన, రమణీయమైన తెలుగును మాట్లాడుతుంటే ఎంతో ప్రశాంతత ఉంటుందని వివరించారు.

వచ్చే నెల 5వ తేదీన ప్రధాని మోదీ చేతులమీదుగా ముంబైలో జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకుంటున్నందుకు తెలుగు వ్యక్తిగా గర్వపడుతున్నానని తెలిపారు. తెలుగు భాషోద్యమ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దెపూడి శ్రీనివాసులు, సత్యాగ్రహ ఆశ్రమ కన్వీనర్ కృష్ణారెడ్డి, గూడూరు లక్ష్మి, నెల్లూరు రెడ్‌క్రాస్ ఛైర్మన్ ఎ.వి.సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, హనుమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

---

## వాళ్లను చూసి నేర్చుకుందాం!

తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంలోనూ, తమ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవడంలోనూ రాజకీయాలకతీతంగా తమిళులు చూపిస్తున్న సమైక్యత ఆంధ్రా ప్రజలకు స్ఫూర్తి దాయకం కావాలి. తమిళనాడు నాయకులను చూసి మన నాయకులు, తమిళ ప్రజలను చూసి ఆంధ్ర ప్రజలు నేర్చుకోవాల్సింది చాలావుంది. ఏపిలో వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలకోసమే పనిచేస్తుంటే, తమిళనాడులో మాత్రం వాళ్ల రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తున్నారు. సుప్రీం కోర్టు నిషేధించిన చట్టవిరుద్ధమైన జల్లికట్టును పోరాడి వాళ్ళు సాధించుకుంటే, పార్లమెంటు సాక్షిగా విభజన చట్టంలో పొందుపరచిన ప్రత్యేకహోదాను మనం సాధించుకోలేకపోయాం. కనీసం అందుకు పోరాడలేకపోయాం. ఇదేనా తెలుగుజాతి ఆత్మగౌరవం. ఉందా? సచ్చిందా?

*గండి మనోహర్, నెల్లూరు.*

## అడవిగా మారిన రైల్వేస్థలం

కావలి పట్టణంలో ఉదయగిరి బ్రిడ్జికి దక్షిణ వైపున వున్న రైల్వే స్థలం అడవిగా మారిపోతున్నది. ముళ్లచెట్లమయమైంది. పందులు బొర్లాడుతున్నాయి. ఒకప్పుడు ఈ స్థలం ఎంతో విశాలంగా ఉండేది. స్థానికులు వచ్చి బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ వంటివి ఆడుకునేవాళ్లు. ఈ స్థలాన్ని శుభ్రం చేస్తే క్రీడామైదానంగా వాడకోవచ్చు.

*ఎ.ప్రవీణ్, కావలి.*

## పనికిమాలిన పనులు

ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి అమరావతి రాజధానిలో పర్యటించిన ప్రాంతాల్లో తెలుగుదేశం వాళ్లు పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేసామనడం విచారకరం. ప్రతిపక్ష నేత జగన్‌కే కాదు, ఈ దేశంలో పుట్టిన ఎవరికైనా ఈ దేశంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించే హక్కుంది. ఇలాంటి కక్ష సాధింపు చర్యలకు గతంలో వై.యస్ పాల్పడి వుంటే అసలు చంద్రబాబు రాష్ట్రంలో తిరగగలిగి ఉండేవాడా? అధికార, విపక్ష నేతలు రాజకీయ విలువను గౌరవించడం నేర్చుకోవాలి.

*సి.నాగేశ్వరరావు, శ్రీకాళహస్తి.*



### శాసనమండలి ఛైర్మెన్‌గా...

# బాబు మదిలో సోమిరెడ్డి?



చంద్రబాబు ఆలోచనలు, రాజకీయాలు భలే తమాషాగా ఉంటాయి. సీనియర్ అయినా కూడా రాజకీయాల్లో చలాకీగా ఉంటూ ప్రత్యర్థులపై ఎప్పుడెప్పుడు విరుచుకుపడదామా అన్నట్లుండే కోడెల శివప్రసాదరావును అసెంబ్లీ స్పీకర్‌ని చేసాడు. సీనియర్ నాయకుడిగా ఆయన మంత్రి పదవిని ఆశించారు. కాని చంద్రబాబు ఆయన వ్యవహారశైలికి విరుద్ధంగా ఉండే స్పీకర్ కుర్చీ అప్పగించారు. అది ఆయనకు ముళ్లకుర్చీలాగుంది. ఆ కుర్చీలో కూర్చున్నప్పటి నుండి ఆయన ఎంత ఇబ్బందిగా ఫీలవుతున్నాడో చూస్తూనే ఉన్నాం. ఆయన కుర్చీలో నిష్పక్షపాతంగా వ్యవహరించలేక, అలాగని పూర్తి స్థాయిలో తెలుగుదేశం నాయకుడిలా ప్రవర్తించలేక తెగ ఇబ్బందిపడుతున్నారు. చంద్రబాబు రెండు మూడురోజులు మొక్కుబడిగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తుండబట్టి కోడెల నిగ్రహంతో ఉండగలుగుతున్నాడు గాని, గతంలోలాగా 20, 30రోజులు అసెంబ్లీ సమావేశాలు పెడితే ఆయన చాలా ఇబ్బంది పడాల్సివచ్చేది.

ఇప్పుడు కోడెల లాగే సోమిరెడ్డిని కూడా కదలకుండా మెదలకుండా ఉండే కుర్చీలో కూర్చోబెట్టాలని చంద్రబాబు భావిస్తున్నాడని పొలిటికల్ టాక్! త్వరలో శాసనమండలి ఛైర్మెన్ చక్రపాణి పదవీకాలం ముగియనుంది. 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చినప్పుడే ఆయనను తొలగించి తెలుగుదేశం ఎమ్మెల్సీలలో ఒకరిని ఛైర్మెన్‌ను చేయాలనుకున్నాడు. అయితే ఆయన వైకాపా కాకుండా కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్సీ కావడం, అందులోనూ బలహీనవర్గాలకు చెందిన నాయకుడు కావడంతో చంద్రబాబు ఆ పని చేయలేదు. ఇప్పుడు ఆయన పదవీకాలం పూర్తవుతుంది కాబట్టి తన పార్టీవారిని పెట్టుకోవచ్చు. ఈ కోవలో ఆయన ఆలోచనకు తడుతున్న మొదటి పేరు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి! వాస్తవానికి ఈయన మంత్రి పదవిని ఆశిస్తున్నాడు. అందుకు తగ్గ నాయకుడు కూడా! నెల్లూరుజిల్లా నుండి నారాయణ మంత్రిగా వున్నా కూడా లేనట్లే లెక్క! ఆయన అమరావతి మంత్రిగా ముద్రపడ్డాడు. జిల్లాలో పార్టీ కేడర్‌కు అందుబాటులో ఉండే సోమిరెడ్డికి మంత్రి పదవినివ్వాలని ఈ జిల్లాలో పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తల కోరిక! మంత్రివర్గ విస్తరణ ఆశావహుల జాబితాలో సోమిరెడ్డి పేరు అగ్రస్థానంలో వుంది. అయితే నెల్లూరుజిల్లా నుండి సోమిరెడ్డికి మంత్రిపదవి ఇస్తే, నారాయణ ఎందుకూ పనికిరాడు. ఆయనను అనుకునే వాళ్లుండరు. అలాగని సోమిరెడ్డికి ప్రాధాన్యత కల్పించకపోతే జిల్లాలో పార్టీ కేడర్ నిరుత్సాహం చెందుతుంది. అందుకని మధ్యేమార్గంగా త్వరలో ఖాళీ అవుతున్న శాసనమండలి ఛైర్మెన్ సీటును సోమిరెడ్డికి అప్పగిస్తే ఇటు నారాయణకు కూడా ఇబ్బంది లేకుండా ఉంటుందని చంద్రబాబు ఆలోచన. ఇదే జరిగితే కోడెల మాదిరిగానే సోమిరెడ్డి కూడా నోరు కట్టేసుకోవాల్సి వస్తుంది. ఆయన వ్యవహారశైలికి ఏ మాత్రం సెట్‌కాని పదవి ఇది!

తెలుగుదేశం పదేళ్లు ప్రతిపక్షంలో వున్నా, గత మూడేళ్ల నుండి ప్రతిపక్ష వైకాపా ఎన్ని ఆరోపణలు చేస్తున్నా ధీటుగా బదులిస్తూ వచ్చిన నాయకుడు సోమిరెడ్డి. జగన్‌పై విమర్శలు చేసిన నాయకులకు ర్యాంకులు ప్రకటిస్తే నెంబర్‌వన్ ర్యాంకర్ సోమిరెడ్డే అవుతాడు. అలాంటి సోమిరెడ్డికి మంత్రిపదవి ఇస్తే అటు ప్రతిపక్షంతో, ఇటు అధికారయంత్రాంగంతో చెడుగుడు ఆడుకుంటాడు. అంతేగాని శాసనమండలి ఛైర్మెన్‌ను చేస్తే ఆయన పరిస్థితి 'పుష్పకవిమానం' మూకీ సినిమా మాదిరిగా అవుతుంది.

**మార్చిలో నెల్లూరుజిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయి. తెలుగుదేశం అధికారపార్టీ కాబట్టి ఆ పార్టీ టిక్కెట్‌కు డిమాండ్ ఉండడం సహజమే! అధికారపార్టీనుండైతే స్థానిక ఓట్లు కొంచెం అటుఇటుగా వున్నా గెలుపు గ్యారంటీ అని నమ్మకం. అందుకే ఆ సీటుకు డిమాండ్!**



### ఎమ్మెల్సీ కోసం..

# ఆదాల పంతం

## • వాకాటికి చెక్ తప్పదా?

నెల్లూరుజిల్లాలో పలువురు నాయకులు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ సీటును ఆశిస్తున్నప్పటికీ ప్రస్తుత ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డే తిరిగి అభ్యర్థిగా ఉంటాడని, సీటు గ్యారంటీ ఇవ్వడంతోనే ఈ ప్రజానాయకుడు తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నుండి ఈ పార్టీలోకి జంప్ చేసాడని చెబుతూ వచ్చారు. దానికి తగ్గట్లుగానే జిల్లాలో ఎక్కడ చంద్రబాబు సభ జరిగినా, వాకాటి ముందుగా మైకు తీసుకుని ఆయనకు చెక్కభజన బాగానే చేసాడు. ఇటీవల జిల్లాలో తెలుగుదేశం జనచైతన్యయాత్రలు జరిగినప్పుడు కూడా వాకాటి తనను తాను ఎమ్మెల్సీ అభ్యర్థిగా చెప్పుకుంటూ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లను ఓట్ల కోసం కాకా పట్టసాగాడు. ఇలా చంద్రబాబు చెప్పకుండానే వాకాటి తాను అభ్యర్థిగా ప్రచారం చేసుకోవడంపై ఆదాల ప్రభాకర్‌రెడ్డికి ఆగ్రహం తెప్పించింది. ఎమ్మెల్సీ అభ్యర్థి వాకాటి నారాయణరెడ్డి అని చంద్రబాబు అధికారికంగా ప్రకటించారా? అని ఆయన మంత్రి నారాయణను, పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్రను గట్టిగానే నిలదీసాడని తెలుస్తోంది. పార్టీ అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదని వారు చెప్పడంతో, ముందు వాకాటి ప్రచారం చేసుకోవడం ఆపమని ఆదాల చెప్పడం, పార్టీ అధిష్టానం హెచ్చరించ డంతో వాకాటి నోటికి తాళం పడడం జరిగిపోయాయి.

ఇప్పుడు స్థానికసంస్థల ఎమ్మెల్సీ సీటు కోసం ఆదాల ప్రభాకర్‌రెడ్డి రేస్‌లో నిలిచారు. అంతేకాదు, ఈ సీటు నుండి పోటీ చేయడానికి ప్రధాన అర్హత కూడా తనదేనంటున్నారు. ఎన్నికలకు ముందే పార్టీలోకి వచ్చాను. లోక్‌సభకు పోటీ చేయడానికి అభ్యర్థే లేకుంటే నేను నిలబడ్డాను. భారీతేడాతో ఓడిపోతుందనుకున్న స్థానంలో వైసిపి అభ్యర్థి మేకపాటికి ముచ్చెమటలు పట్టించి కొద్ది ఓట్ల తేడాతో ఓడిపోయాను. నేను పోటీ చేయబట్టే ఉదయగిరి, కోవూరు స్థానాల్లో పార్టీ అభ్యర్థులు గెలిచారు. ఓడినా కూడా పార్లమెంట్‌తో పాటు నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జ్ బాధ్యతలు మోస్తున్నాను. పార్టీ పటిష్టతకు కృషి చేసాను. పార్టీ కోసం నా సొంత డబ్బు ఖర్చుపెట్టుకున్నాను. ముందు ఎమ్మెల్సీ సీటు ఇవ్వాలంటే నాకే ఇవ్వాలి, నా తర్వాత పార్టీలోకి వచ్చిన వాకాటికి ఇస్తే మాత్రం నాకు అన్యాయం చేసినట్లే! నాకంటే ముందు నుండి పార్టీలో వున్న ఇంకెవరికి సీటిచ్చినా నాకు అభ్యంతరం లేదని ఆదాల పంతం పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆదాలను దాటుకుని వాకాటికి సీటొస్తుందా? అన్నది ప్రశ్నార్థకం!

### ఉత్సాహంగా మొదలై...

# ఉత్సవంగా ముగిసిన ఖేలో క్రీడలు



ఈ నెల 19వ తేదీ నెల్లూరు ఏసి స్టేడియం వేదికగా మొదలైన ఖేలో ఇండియా జాతీయ అండర్-14 ఖోఖో, కబడ్డీ, ఉషు పోటీలు 22వ తేదీతో ముగిసాయి. ఎంతో ఉత్సాహభరితమైన వాతావరణంలో ఈ పోటీలను నిర్వహించారు. 17రాష్ట్రాల క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లతో ఈ నాలుగురోజుల పాటు నెల్లూరు కళకళలాడింది. 22వ తేదీ సాయంత్రం స్టేడియంలో పోటీల ముగింపు కార్యక్రమం జరిగింది. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ క్రీడా పోటీలను విజయవంతం చేసిన జిల్లా అధికారుల కృషిని అభినందించారు. 2019లో నెల్లూరులో జాతీయ క్రీడల నిర్వహణకు మొగళ్ళపాలెం వద్ద 150 ఎకరాల భూమిని సేకరించడం జరిగిందని, 6కోట్ల వ్యయంతో ఇక్కడ మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ క్రీడలను నెల్లూరులో నిర్వహించేందుకు కష్టపడ్డ శాప్ అధికారులను, జిల్లా స్పోర్ట్స్ అధికారులను అభినందించారు. జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, ఈ ఆటల పోటీలకు సహకరించిన కోచ్‌లు, మేనేజర్లు, అంపైర్లకు ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇంకా ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, శాప్ ఛైర్మెన్ పి.ఆర్.మోహన్, కేంద్ర స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతినిధి కన్వజిత్‌సింగ్, జాయింట్‌కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, జేసీ-2 చంద్రమౌళి, జడ్పీ సిఇఓ రామిరెడ్డి, శాప్ డైరెక్టర్ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



**విజేతలు:** ఖోఖో బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ బంగారు, గుజరాత్ రజతం, తెలంగాణ కాంస్యం పతకాలు సాధించాయి. బాలుర విభాగంలోనూ ఆంధ్రా జట్టు మొదటి స్థానంలో నిలవగా తెలంగాణ, గుజరాత్‌లు రెండవ, మూడవ స్థానాలలో నిలిచాయి.

కబడ్డీ బాలికల విభాగంలో హరియాణా ప్రథమ స్థానంలో నిలవగా, ఆంధ్ర, కర్నాటక జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచాయి. బాలుర విభాగంలో ఆంధ్ర జట్టు విజేతగా నిలవగా, పంజాబ్, హరియాణాలు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి.

ఉషు పోటీలలో మణిపూర్ జట్టుకు ఎదురులేకుండా పోయింది. తమిళనాడు, ఆంధ్రా జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి.

## ఆహ్వానం లేని ఆనం

నెల్లూరు ఏ.సి స్టేడియంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జాతీయ స్థాయి ఖేలో ఇండియా పోటీలకు ఆనం సోదరులను ఆహ్వానించకపోవడంతో వారు మనస్థాపం చెందినట్లు తెలిసింది. ఒకప్పుడు వి.ఆర్ విద్యాసంస్థలలో పిఇడిగా పనిచేసి ప్రస్తుతం శాప్ సభ్యుడిగా ఉన్న రవీంద్రబాబుకు కూడా వారిని పిలవాలని, లేదా పిలవలేదనే సంగతి గుర్తుకు రాకపోవడం విశేషం. ఆనం సోదరులకు అధికారిక పదవులు లేనప్పటికి ఇప్పుడైతే అధికార పార్టీలో వున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేగా ఆనం వివేకాలు ఏ.సి స్టేడియంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతోనే ఇటీవల ఏ.సి స్టేడియంలో పనులు పూర్తయ్యాయి. కనీసం ఆ దృష్ట్యా కూడా తమను ఖేలో ఇండియా పోటీలకు పిలవకపోవడంతో ఆనం బ్రదర్స్ ఫీల్ అయ్యారు. పోటీల ముగింపు తర్వాత శాప్ ఛైర్మెన్ పి.ఆర్ మోహన్‌కు విషయం తెలిసి సంతపేటలోని ఆనం రామనారాయణరెడ్డి ఇంటికి వెళ్లి జరిగిన పొరపాటుపై సర్దిచెప్పినట్లు తెలుస్తోంది.

## పోలీసుల స్పెషల్ డ్రైవ్



నేర నియంత్రణ, ప్రమాదాల నివారణకు నెల్లూరు నగర డిఎస్పీ వెంకటరాముడు చర్యలు చేపట్టారు. డిఎస్పీ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు నగరంలో పోలీస్ అధికారులు ప్రత్యేకడ్రైవ్ నిర్వహించారు. చిల్డ్రన్స్‌పార్క్, హరనాథపురం, మాగుంట లే అవుట్, అన్నమయ్యసర్కిల్, మినీబైపాస్‌రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టారు. నగరంలో అధికశాతం గొలుసు దొంగతనాలకు పాల్పడే నిందితులు హై స్పీడ్ బైక్‌లను వినియోగిస్తున్నట్లు తేలడంతో వాటిపై ప్రత్యేకదృష్టి సారించారు. వాహన పత్రాలు, లైసెన్స్‌లు లేని వాహన చోదకులకు భారీగా జరిమానాలు విధించారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు ఆరు పోలీస్‌స్టేషన్ల అధికారులు, సిబ్బంది స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



## ఈ మంతనాల మర్మమేంటో!

2014 ఎన్నికల తర్వాత నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం వైపు కన్నెత్తి చూడని మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, ఆ తర్వాత తొలిసారిగా 21వ తేదీ కార్పొరేషన్ కార్యాలయంకు వచ్చారు. మేయర్ సి.సి పేషీలో మంత్రి నారాయణతో 20 నిముషాల పాటు ఆయన ప్రత్యేకంగా మంతనాలు జరిపారు. ఈ సమయంలో వివేకా కొడుకు, కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి కూడా అక్కడే వున్నారు. వీళ్లు మాట్లాడుకుంటున్నంతసేపు లోపలకు ఎవరినీ రానీయలేదు. వీళ్లు మాట్లాడుకోవడం ఆపి మేయర్ ఛాంబర్‌లోకి వచ్చాక నారాయణ తన పక్కనే వివేకాను కూర్చోబెట్టుకున్నాడు. ఈ వ్యవహారమంతా కూడా ఆనం అంటే పడని మేయర్ అజీజ్‌కు మండేలా చేసింది. అయినా చూస్తూ ఉండడం తప్ప ఆయన మాత్రం ఏం చేయగలడు.

## డాక్టర్ ప్రసన్నకు ఉత్తమ న్యూరోసర్జన్ పురస్కారం



సింగపూర్ హాస్పిటల్ న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ వెంకటేశ్వర ప్రసన్నకు 2016 ఉత్తమ న్యూరోసర్జన్ అవార్డుతో ఇటీవల నెల్లూరు టౌన్ హాల్‌లో సత్కరించారు. ప్రజాసత్తా 13వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, ఏఎస్పీ శరత్‌బాబు, తెలుగుదేశంపార్టీ నగర అధ్యక్షులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సింహపురి హాస్పిటల్స్ ఛైర్మెన్ కాటంరెడ్డి రవీంద్రరెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొని ఆయనను ఈ అవార్డుతో సత్కరించారు.



## ఏటూరు నాగేంద్రరావుకు జనరంజక కవితా పురస్కారం

నెల్లూరుకు చెందిన ప్రముఖకవి, సాహితీవేత్త, ఎస్‌పిఎస్ఆర్ నెరసం ఉపాధ్యక్షులు ఏటూరు నాగేంద్రరావుకు జనరంజక కవితా ప్రతిభా పురస్కారం లభించింది. ఏటూరు నాగేంద్రరావు రాసిన కవితా సంపుటి 'పూవులు సమ్మె చేస్తాయి' ఈ అవార్డును గెలుచుకుంది. సుప్రసిద్ధ సాహితీవేత్త రావి రంగారావు అందించే జనరంజక కవితా పురస్కారంలో రెండు వేల నగదు, సత్కారం ఉంటాయి. ఫిబ్రవరి 10వ తేదీన జరిగే ప్రత్యేక కార్యక్రమంలో గుంటూరులో నాగేంద్రరావుకు ఈ సత్కారం జరుగుతుంది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు చిన్ని నారాయణరావు ఒక ప్రకటనలో ఏటూరిని అభినందించారు.

## నిఘా కళ్ల మధ్య ప్రాక్టికల్స్

### - వైసిపి స్టూడెంట్స్ యూనియన్ డిమాండ్



రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం ప్రాక్టికల్స్‌లో జంబ్లింగ్ విధానాన్ని తొలిసారిగా ప్రవేశపెడుతున్నందువల్ల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు అక్రమాలకు పాల్పడకుండా ప్రతి ప్రాక్టికల్ గదిలోనూ సి.సి కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ స్టూడెంట్స్ యూనియన్ నగర అధ్యక్షులు శేషగౌడ్, ప్రధాన కార్యదర్శి రాకేష్, రూరల్ కన్వీనర్ మధు, నగర ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కార్యదర్శులు సమీ, పవన్, విద్య, సాయి, పార్దులు ఇంటర్మీడియట్ ఆర్ఐఓ బాబుజాకబ్‌కు వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా నారాయణ, శ్రీచైతన్య వంటి కార్పొరేట్ కళాశాలలకు ఎక్కువసంఖ్యలో బ్రాంచ్‌లు ఉన్నందువల్ల ఒక బ్రాంచ్‌కు చెందిన విద్యార్థులు మరోబ్రాంచ్‌లో పడకుండా తగుచర్యలు తీసుకోవాలని వారు ఆ వినతిపత్రంలో కోరారు.

## లోకేష్‌ను కలిసిన మేయర్



తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలందరూ 23వ తేదీ తెలుగుదేశం యువరాజు నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలను నెల్లూరులో జరుపుకుంటే, నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్ మాత్రం అందుకు భిన్నంగా నా రూటే సపరేటు అంటూ గుంటూరుకు పోయాడు. నారా లోకేష్‌ను నేరుగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అజీజ్ తన వెంట మరికొందరు కార్పొరేటర్లను కూడా తీసుకెళ్లాడు.

## అగ్నిమాపక సంఘం కొత్త కార్యవర్గం

జిల్లా అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘంకు కొత్త కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా నారాయణ, కార్యదర్శిగా రామ్మూర్తి, కోశాధికారిగా డేవిడ్‌సన్, సహాయకార్యదర్శిగా మస్తాన్, ఉపాధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం, సలహాదారుడిగా కమలాకర్‌లను ఎన్నుకున్నారు. కొత్త కార్యవర్గ సభ్యులు 22వతేదీ జిల్లా అగ్నిమాపక శాఖాధికారి జ్ఞానసుందరం, అదనపు అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాసరావులను మర్యాదపూర్వకంగా కలిసారు.

## నేత్రదానం



నెల్లూరు నగరం నవాబుపేట నజీర్ తోట వాస్తవ్యులు పగడాల శ్రీధర్‌రావు(60) ఆదివారం పరమపదించారు. శ్రీధర్‌రావు కుటుంబసభ్యుల కోరికమేరకు డా॥ పి.ఎల్.రావు సారథ్యంలో ఐ టెక్నీషియన్ వెంకటేశ్వర్లు పగడాల శ్రీధర్‌రావు నేత్రాలను సేకరించారు. నేత్రదాత కుటుంబసభ్యులు, నేత్రదాన మోటివేటర్ బయ్యా ప్రసాద్ పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## కోటంరెడ్డిని కలిసిన సూరీడు

ఒకప్పుడు దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డికి నమ్మినబంటు, ఆయన ప్రభుత్వంలో అదనపు కార్యదర్శిగా కూడా పనిచేసిన సూరీడు 24వ తేదీ నెల్లూరొచ్చారు. సరస్వతీనగర్‌లోని వైయస్సార్సీపీ నెల్లూరురూరల్ కార్యాలయంలో గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని కలిసారు. దాదాపు అరగంట పాటు వారి మధ్య మంతనాలు జరిగాయి. వై.యస్. వున్నంతకాలం ఎక్కడ చూసినా ఆయన వెనుకే సూరీడు కనిపించేవాడు, వై.యస్ మరణం తర్వాత సూరీడు కూడా తెరమరుగయ్యాడు. అప్పటినుండి వై.యస్ కుటుంబానికి కూడా దూరమయ్యాడు. ఇప్పుడు హఠాత్తుగా వై.సిపి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని ఆయన కలవడం చర్చనీయాంశమైంది.

## 'శుభమస్తు'లో రక్తదాన శిబిరం



నెల్లూరులోని న్యూరాజ్యలక్ష్మి హాల్, శుభమస్తు షాపింగ్‌మాల్ వ్యవస్థాపకులు స్వర్గీయ బయ్యా వెంకటరమణయ్య ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆదివారం శుభమస్తు ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ పినాకిని ఆధ్వర్యంలో శుభమస్తు షాపింగ్‌మాల్‌లో మెగా రక్తదాన శిబిరం జరిగింది. శుభమస్తు, న్యూరాజ్యలక్ష్మి హాల్ సిబ్బంది రక్తదాతలు 75మంది రక్తదానం చేశారు. ఈ శిబిరంలో మహిళలు కూడా రక్తదానం చేశారు. ముఖ్యఅతిథిగా రెడ్‌క్రాస్ ఛైర్మెన్ డా॥ ఎ.వి.సుబ్రహ్మణ్యం, శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేతలు బయ్యా వాసు, బయ్యా రవికుమార్, లయన్స్, పినాకిని అధ్యక్షుడు పి.సీతారామారావు, బ్లడ్ మోటివేటర్ బయ్యా ప్రసాద్, షాపింగ్‌మాల్ సిబ్బంది పాల్గొన్నారు.

## తప్పుడు పనులపై చర్యలు

జిల్లాలోని అన్ని మీ-సేవ, ఆధార్ నమోదు కేంద్రాల్లో తప్పుడు వయస్సుతో ధృవీకరణ పత్రాలు పొంది వున్నా, ఇచ్చి వున్నా అలాంటి వారిపై కఠిన చర్యలుంటాయని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు ఒక ప్రకటనలో ఘాటుగా హెచ్చరించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కోసం తప్పుడు వయస్సు ధృవీకరణ పత్రాలు అందజేసి ఆధార్ కార్డులలో వయసు మార్పు చేసుకుంటున్నారు. అలాంటి వారిపై చర్యలు తప్పవు. అలాగే వాటిని నమోదు చేసే ఆధార్ కేంద్రాల ఆపరేటర్లపై కూడా చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

### చంద్రబాబును మించిన...

# చినబాబు బర్త్‌డే హంగామా!





ఇంకో సంవత్సరం తర్వాత తెలుగుదేశం నాయకులందరు కూడా చంద్రబాబును మరచిపోయేటట్లున్నారు. చినబాబు మైకంలో మునిగిపోతున్నారు. చినబాబు నారా లోకేష్ బర్త్‌డేను తమ బర్త్‌డేకంటే కూడా ఘనంగా జరుపుకుంటున్నారు. ఫ్లెక్సీ కటౌట్‌లు కూడా చంద్రబాబు కంటే లోకేష్‌బాబుకే ఎక్కువ కడుతున్నారు. 23వ తేదీ నారా లోకేష్ జన్మదినోత్సవ వేడుకలను నెల్లూరులో తెలుగుతమ్ముళ్లు అంగరంగ వైభవంగా నిర్వహించారు. లోకేష్ 34వ పుట్టినరోజు సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 34కిలోల కేక్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర కట్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ధర్మవరం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇక తెలుగునాడు విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు కాకర్ల తిరుమలనాయుడు ఆధ్వర్యంలో శ్రీచైతన్య కళాశాలలో లోకేష్ బర్త్‌డే వేడుకలను నిర్వహించారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ జడ్. శివప్రసాద్‌లు కేక్ కట్ చేసారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు అమ్ముల్లా, సురేష్‌రెడ్డి, మోనూరాజ్, ముజీర్, సాయి, దేవా, మురళీ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు శ్రీనివాస అగ్రహారంలో నారా లోకేష్ సేవాసమితి రాష్ట్ర కార్యాలయం వద్ద నిర్వహించిన లోకేష్ బర్త్‌డే వేడుకలలో శాసనమండలి సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డిలు పాల్గొన్నారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కంచి మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఇక్కడ పేదలకు అన్నదానం, అలాగే రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇంకా గీతామయి వృద్ధాశ్రమంలో రెడ్‌క్రాస్ స్పాస్టిక్ సెంటర్‌తో పాటు పలు చోట్ల చినబాబు జన్మదిన వేడుకలను తెలుగతమ్ముళ్లు ఒక పండుగలాగా జరుపుకున్నారు. జిల్లా అంతటా కూడా చినబాబు జన్మదినోత్సవాన్ని బాగానే జరిపారు.



# స్వచ్ఛభారత్‌లో ముందుందాం!

ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛభారత్ పథకంలో భాగంగా నెల్లూరుజిల్లాను ఆత్మగౌరవం పేరుతో బహిరంగ మలవిసర్జన రహిత ప్రాంతంగా చేయాలని జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తుందని శాసనమండలి సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆత్మగౌరవం పథకంలో భాగంగా మనుబోలు మండలం బద్దెవోలు గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మరుగుదొడ్ల నిర్మాణంలో అనేక సంవత్సరాలుగా నిర్లక్ష్యం వహించడం జరిగిందని, ఇప్పటికైనా మరుగుదొడ్ల నిర్మాణం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు. బద్దెవోలు గ్రామంలో 172మందికి వృద్ధాప్య పింఛన్లు అందుతున్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్లకు ప్రభుత్వం రూ. 6వేల కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు మాట్లాడుతూ జిల్లాలో ఏడు మున్సిపాల్టీలను బహిరంగ మల విసర్జన రహిత ప్రాంతాలుగా మలచుకున్నామని, ఓడిఎఫ్‌లో గుజరాత్ తర్వాత ఆంధ్రప్రదేశ్ ద్వితీయ స్థానంలో వుందని అన్నారు. మనుబోలు మండలంలోని 19గ్రామాలలో 7గ్రామాలను ఓడిఎఫ్‌గా మార్చామని, మరో 12గ్రామాలను 36 గంటల్లో ఓడిఎఫ్ గ్రామాలుగా తీర్చిదిద్ది ఆదర్శమండలంగా ప్రకటిస్తామని కలెక్టర్ అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా ప్రజాపరిషత్ సిఇఓ బి.రామిరెడ్డి, గ్రామీణ నీటి పథకం ఎస్.ఇ కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ వజ్రమ్మ, జడ్పీటీసీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల బ్రాండ్ అంబాసిడర్ విపిఆర్






నెల్లూరుజిల్లాలో నిరుపేదలకు బ్రాండ్ అంబాసిడర్‌గా విపిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని పేర్కొనవచ్చు. ఆయనకు కోట్లున్నా, వృత్తి వ్యాపారమైనా, ఆయన ఎక్కువ సమయం ఆలోచించేది పేదల గురించి, వారికి చేసే మంచి పనుల గురించే! ఈ కోణంలో ఆయనను నిరుపేదల పెన్నిధి, ప్రతినిధిగా కూడా చెప్పుకోవచ్చు. ముఖ్యంగా నిరుపేదలకు విద్య, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలను ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో ఆయన విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఉచిత పాఠశాల, ఉచిత వైద్యశాలను నిర్వహించడం చూస్తున్నాం. అలాగే జిల్లాలోని వివిధ ప్రభుత్వ స్కూళ్లలో చదివే పేదవిద్యార్థులకు ప్రతిఏటా ఉచితంగా స్కూల్ కిట్స్ అందజేస్తుంటారు. కెనడాకు చెందిన స్కా సంస్థ ఆధ్వర్యంలో ఆయన గత ఏడేళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నెల 23వ తేదీన నెల్లూరురూరల్ కనుపర్తిపాడులోని విపిఆర్ విద్య పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని 19మండలాలకు చెందిన 47 ప్రభుత్వ పాఠశాలల్లోని 550మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు ఒక్కోటి 5వేల రూపాయల విలువచేసే కిట్లను వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అందజేశారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కెనడా సంస్థ స్కా ప్రతినిధులు మరియన్‌లాంగ్‌ఫోర్డ్, ఎన్సె గ్రావెస్, మిచిలీగ్రావెస్, విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ఆచార్య నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌వి అరుపులు...

# బాబువి మెరుపులు

**- వివేకా**



మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి మరోసారి తనదైన శైలిలో ప్రతిపక్ష నేత జగన్‌పై విరుచుకుపడ్డారు. మొన్న నెల్లూరులోని తన కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగన్‌ను నోటికొచ్చినట్లు మాట్లాడారు. జగన్‌ని గుడ్లగూబతో పోల్చాడు. ఆయన ఎక్కడ తిరిగితే అక్కడ అరిష్టమన్నారు. రెండేళ్లలో ముఖ్యమంత్రిని అవుతానని ఆయన కాకిలా అరుస్తున్నాడని, అవి అరుపులుగానే మిగిలిపోతాయని ఎద్దేవా చేసాడు. ఈ రాష్ట్రంలో అభివృద్ధి వెలుగులు, ప్రగతి మెరుపులు చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. పోలవరం ప్రాజెక్ట్‌కు, పట్టిసీమకు, రాయలసీమకు ఇచ్చే నీళ్లకు కూడా జగన్ అడ్డం పడుతున్నాడని, ఇలాంటి నాయకుడిని ప్రజలు ఎలా ఆదరిస్తారని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు కట్టబోయే ఏపి రాజధాని అమరావతి ఢిల్లీని తలదన్నే రీతిలో ఉండబోతుందని, ఈ రాజధానిని చూడడానికి రెండుకళ్లు చాలవని అన్నారు. అతిగా ఆశపడే మగాడు, అతిగా ఆవేశపడే ఆడది బాగుపడినట్లు చరిత్రలో లేదని, సీఎం కుర్చీపై అతిగా ఆశపెట్టుకున్న జగన్ కూడా ఎప్పటికీ సీఎం కాలేడన్నారు.

# కళ్యాణ మండపంలో... కులం మంటలు



అది తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపం... ప్రతినెలా శ్రీవారి కళ్యాణంతో పాటు సుముహూర్తాల సమయంలో వివిధ జంటల కళ్యాణాలు ఎంతో ప్రశాంతంగా జరుగుతుంటాయి. ఆ కళ్యాణ మండపం రాజకీయాలకతీతం. కుల దూషణలకు దూరం. అలాంటి కళ్యాణ మండపాన్ని కూడా కలుషితం చేసి పెట్టారు. కులపోరుకు దానిని వేదికచేసి గబ్బు పట్టించారు అధికారులు.

వివరాలలోకి వెళ్తే... కాపులు, బలిజ, తెలగ, ఒంటరి కులాలను బి.సిలలో చేర్చే విషయమై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ మంజునాథ్ కమిషన్ రాష్ట్రమంతా పర్యటిస్తూ 22వ తేదీ నెల్లూరు, దర్గామిట్టలోని టిటిడి కళ్యాణ మండపంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. తమను బిసిలలో చేర్చాలని కోరుతూ కాపులు, వారిని చేర్చడానికి వీల్లేదంటూ బీసీలు పెద్దఎత్తున ఇక్కడకు చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఉదయం 10.30గంటలకు ప్రజాభిప్రాయ సేకరణ మొదలుపెట్టి జస్టిస్ మంజునాథ్ కమిషన్ ఏర్పాటు చేసిన లక్ష్యాన్ని చెప్పే ప్రయత్నం చేయగా బి.సిలు అడ్డుకున్నారు. కమిషన్ 'గోబ్యాక్' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేయసాగారు. తెలుగుదేశం నాయకుడు, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు ఒట్టూరు సంపత్ రాజు అయితే జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన యాదవులతో కలిసి టిటిడి కళ్యాణ మండపం దాకా పెద్ద ర్యాలీని చేసాడు. కాపులను బీసీలలో చేర్చే విషయమై మీ అభిప్రాయం చెప్పాలని జస్టిస్ మంజునాథ్ కోరగా, అసలు వారిని బీసీలలో చేరిస్తే ఒప్పుకునే సమస్యే లేదని, అలాంటప్పుడు ప్రత్యేకంగా అభిప్రాయం చెప్పేదేముంటుందని సంపత్‌రాజు నినదించారు. మధ్యాహ్నం దాకా రచ్చతోనే సరిపోయింది. లంచ్ తర్వాత కమిషన్ మళ్లీ సమావేశం నిర్వహించగా అటు బి.సిలు, ఇటు కాపులు చెరో వర్గంగా చేరి తమ శైలిలో రచ్చకుదిగారు. జస్టిస్ మంజునాథ్‌కు ప్రతిచోటా ఇది అలవాటే కాబట్టి సాయంత్రం వరకు ఓపిగ్గా విని వెళ్లిపోయారు. విశేషమేంటంటే కమిషన్ ముందు రచ్చకు దిగిన ఇరుకులాలలోనూ టిడిపి నాయకులే ఎక్కువమంది ఉండడం.

# ఉన్నత లక్ష్యాలకు పేదరికం అడ్డు కాదు

## - నెల్లూరుజిల్లా కలెక్టర్ ముత్యాలరాజు



ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే పేదరికం అడ్డు కాదని, క్రమశిక్షణ, ధృడచిత్తం, సమయపాలన పాటించడం వల్ల ప్రతి విద్యార్థి తమ లక్ష్యాలను సాధించుకోగలరని నెల్లూరుజిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు అన్నారు. 21వ తేదీ నెల్లూరులోని రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన విజేతతో విద్యార్థుల ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఐఏఎస్ పరీక్ష అత్యున్నతమైనదేమీ కాదని, విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో రాణిస్తే విజయం సాధించినట్లేనన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన తాను ఏ విధంగా ఐఏఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిందీ ఆయన వివరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ అహ్మద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



త్వరలో...

# కొత్త కమిషనర్

## - మన మంత్రి నారాయణ పక్కాగా చెప్పారు



మరో 15రోజుల్లో నెల్లూరు నగర కార్పొరేషన్‌కు రెగ్యులర్ కమిషనర్‌గా హరీష్ విధుల్లో హాజరవుతారని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి డా॥ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో 21వ తేదీ ఇంజనీరింగ్ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ కార్పొరేషన్‌కు ఒక నెలలో రూ. 155కోట్లు నిధులు తీసుకువచ్చినట్లు తెలిపారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు దళిత కాలనీలకు ఖర్చుపెడతామని, వివక్ష ఏమీ ఉండదన్నారు. కొంతమంది అనవసరంగా విమర్శలు చేస్తున్నారన్నారు. ఈ నెల 31వ తేదీ నాటికి కార్పొరేషన్‌లో ఎస్సీ సబ్ ప్లాన్ పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో నగర మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, చాట్ల నరశింహారావు, ఇంజనీర్ ఇన్ చీఫ్ పాండురంగారావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఇ మోహన్, కార్పొరేషన్ ఎస్ఇ శ్రీనివాసరాజు, డి.ఇ సుందరరామిరెడ్డి పాల్గొన్నారు.

# ఈ పోలీసు బిడ్డ... బంగారం!

## అభినందించిన ఎస్పీ విశాల్



నెల్లూరు ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాసులు కుమార్తె లలితకుమారి అనంతపురం జెఎన్‌టియులో ఎంటెక్ కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో టాపర్‌గా నిలిచి రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రతిభా పురస్కారం క్రింద రూ. 20వేలు, ట్యాబ్, గోల్డ్‌మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా లలిత కుమారిని నెల్లూరులోని ఉమేష్ చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో ఉన్నతస్థానానికి చేరు కోవాలని ఎస్పీ ఆకాంక్షించారు. పోలీసు అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలు



నెల్లూరు బాలాజీనగర్‌లోని శ్రీ త్యాగరాజస్వామి కళ్యాణ మండపంలో సోమవారం సద్గురు శ్రీ త్యాగరాజస్వామి వారి 33వ ఆరాధనోత్సవ సంస్థ ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాజస్వామి వారి ఆరాధనోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి చిత్రపటానికి సీతారామస్వామి మందిరం నుండి మంగళ వాయిద్యాలతో నగర సంకీర్తన చేశారు. అనంతరం పంచరత్న గోష్టి జరిగింది. ఎం.లక్ష్మీకామాక్షి, ఎస్.నాగలక్ష్మి, ఎస్.ఎస్.వనజా లత, పి.దేవసేన శిష్యబృందంచే కచేరి జరిగింది. అనంతరం కళాకారులు కంచికామకోటి పీఠ ఆస్థాన విద్వాంసులను సన్మా నించారు. సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ఎన్.వి.రమణయ్య, నాట్యాచార్య జొన్నవాడ రామమూర్తి, కార్పొరేటర్లు అంచూరు జానకి, ఉచ్చి భువనేశ్వరిప్రసాద్ పర్యవేక్షించారు.

---

# అభివృద్ధికి కలిసిరండి... కదలిరండి

## - గూడూరు వాసులకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే సునీల్



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తదితరులు

గూడూరు అభివృద్ధికి దాతలు సహకారం ఎంతైనా అవసరం ఉందని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియానికి ఆసుపత్రి రోడ్డు మార్గం నుంచి నూతనంగా కనుమూరి హరిచంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ దాతృత్వంతో ఏర్పాటు చేసిన తారు రోడ్డును సోమవారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్, పెంచలకోన ట్రస్టు ఛైర్మెన్ నానాజీ తదితరులు దాత కనుమూరి హరిచంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ మాట్లాడుతూ దివంగత కనుమూరి సత్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థం తారురోడ్డును నిర్మించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, టిడిపి పట్టణ అధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షురాలు మట్టం శ్రావణి, జడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, హరిచంద్రారెడ్డి ట్రస్టు ఛైర్మెన్ కె.మునిగిరీష్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



## గూడూరు డివిజన్ వార్తలు

# ఓటు హక్కు యువతకు వజ్రాయుధం

## - ఇన్‌ఛార్జి ఆర్డీవో వెంకటసుబ్బయ్య



ఓటు హక్కు యువతకు వజ్రాయుధమని, ఓటుతో దేశ దశ దిశ మార్చవచ్చునని ఇన్‌ఛార్జి ఆర్డీవో వెంకటసుబ్బయ్య తెలిపారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని డిఆర్ డబ్ల్యూ కళాశాలలో తహశీల్దార్ సత్యవతి ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సును ఇటీవల నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు ద్వారా ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంతో పాటు, దేశాభివృద్ధికి తోడ్పడుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారి గీతావాణి, తహశీల్దార్ సత్యవతి, కళాశాల ప్రిన్సిపాల్ రేవతిదేవి అధికారులు పాల్గొన్నారు.

# డిఆర్‌డబ్ల్యూ కళాశాలకు వైజేపీ బెంచీలు



బెంచీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీల్, వైజేపీ లయన్స్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో వైజేపీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిట్టంశెట్టి రమేష్ దాతృత్వంతో డిఆర్‌డబ్ల్యూ కళాశాల ప్రాంగణంలో బెంచీలను ఏర్పాటు చేశారు. బెంచీలను ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సేవాదృక్పథం కలిగినవారు చాలా అరుదుగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో వైజేపీ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వి.చంద్రశేఖర్‌రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సిఆర్ రెడ్డి, గురునాథం, మంజులాదేవి, ఎస్ఎల్ఎన్ స్వామి, మురళీనాయుడు, ఆర్.వి.రావు, నారాయణరెడ్డి, వెంకట రమణయ్య, కౌన్సిలర్లు వాటంబేటి శివకుమార్, చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు చర్యలు

## - డిటిసి శివరామ్ ప్రసాద్



కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఆర్డీవో అధికారులు

రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు ప్రత్యేకచర్యలు తీసుకొంటామని జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శివరామ్ ప్రసాద్ తెలిపారు. గూడూరు ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలో ఆర్టీవో చందర్ ఆధ్వర్యంలో ఇటీవల రోడ్డు భద్రతా వారోత్సవాల సదస్సును నిర్వహించారు. భద్రతపై కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిటిసి మాట్లాడుతూ జిల్లాలో గత ఏడాది రోడ్డు ప్రమాదాలు ద్వారా అనేకమంది చనిపోయారని, వీరిలో యువత ఎక్కువమంది ఉండడం బాధాకరమన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో వ్యవహరించాలని సూచించారు. హెల్మెట్‌లు వాడకం ద్వారా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా మరణాలు తగ్గించవచ్చని చెప్పారు. అనంతరం అధికారులు అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఆర్డీవో వెంకటసుబ్బయ్య, రూరల్ సిఐ శ్రీనివాసులురెడ్డి, రవాణాశాఖాధికారులు రామిరెడ్డి, జకీర్, కమలాకర్, సౌజన్య, ఏవో మదానీ, రూరల్ ఎస్ఐ బాబి తదితరులు పాల్గొన్నారు.

# మహిళకు చెక్కు పంపిణీ



కల్పనకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్, ఇన్‌ఛార్జి ఆర్డీవో వెంకటసుబ్బయ్య

గూడూరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన కల్పన అనే మహిళకు గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ రూ. 25వేల చెక్కును అందించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం కల్పనకు ఎమ్మెల్యే, ఇన్‌ఛార్జి ఆర్డీవో వెంకటసుబ్బయ్య చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యవతి, ఆర్ఐ శ్రీనివాసులు, నాయకులు పిట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పన్నీర్‌సెల్వం ముందు ప్రత్యేకహోదా సి.డి ప్రదర్శన

గల్పిక

చెన్నైలోని మెరీనాబీచ్... ఆ తీరంలో సముద్రానికి పోటీగా పోటెత్తిన జనం. తమిళనాడు సీఎం పన్నీర్ సెల్వం, ప్రతిపక్ష నేత స్టాలిన్, విజయ కాంత్, వైగో, సూపర్‌స్టార్ రజనీకాంత్, కమల్‌హాసన్, అజిత్, సూర్య, కార్తి, త్రిష, విజయ్... ఇంకా ఎందరో ప్రముఖులు... జల్లికట్టుపై నిషేధం ఎత్తేయాలంటూ అందరూ నినాదాలతో హోరెత్తిస్తున్నారు. వీరి అరుపుల ముందు సముద్రపు అలల సౌండ్ మూగబోయింది. చెన్నైలోని అన్ని హోటల్స్ వాళ్లు అక్కడే కౌంటర్లు పెట్టారు. లక్షలాదిగా పోగైన ప్రజలకు భోజనం, కాఫీ, టీలు అందిస్తున్నారు. వేల సంఖ్యలో ఐస్‌క్రీం బండ్లు, సోడాబండ్లు, మిక్చర్ బండ్లు, పండ్ల బండ్లు అక్కడకు చేరుకున్నాయి. సీఎం పన్నీర్ సెల్వం ప్రజలనుద్దేశించి... జల్లికట్టుపై నిషేధం ఎత్తేసేదాకా మనం ఇక్కడ నుండి కదిలేది లేదు, మనకు కావాల్సిన ఫుడ్డు, రాత్రి నిద్రపోవడానికి బెడ్డు అంతా ఇక్కడే, కేంద్రం దిగొచ్చేదాకా ఇక్కడ నుండి కదిలేది లేదు అని చెప్పడంతో ప్రజలు చప్పట్లతో హోరెత్తించారు.

★★★★★

ఢిల్లీలోని ప్రధాని కార్యాలయం. ప్రధాని నరేంద్రమోడీతో పాటు కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, మనోహర్ పారికర్, ఎం.వెంకయ్యనాయుడు, అనంతకుమార్‌లు టీవీ ఛానెల్స్‌లో చెన్నైలోని మెరీనా బీచ్ వద్ద దృశ్యాలు చూస్తున్నారు. మోడీ వుండి... ఏంటి... వెంకయ్యాజీ వీరి పిచ్చి, ఏదో తమిళనాడు ప్రజల ఆస్థినంతా మనం జప్తు చేసినట్లు అంత రచ్చ చేస్తున్నారు. జల్లికట్టు కోసం ఇంత రాద్ధాంతమా? అని అడిగాడు. వాళ్లు ఆస్తులు తీసుకున్నా పెద్దగా పట్టించుకోర్సార్, వాళ్ల తమిళ సంప్రదాయాలకు విఘాతం కలిగితే మాత్రం అమెరికా అధ్యక్షుడిని కూడా తెచ్చి రోడ్డు మీద నిలబెడతారని వెంకయ్య అన్నాడు. దీనికి పరిష్కారమేంటని మోడీ అడిగాడు. వెంటనే పన్నీర్ సెల్వంను ఢిల్లీకి పిలిపిద్దాం, నేను ఒక సి.డిని చూపిస్తాను, ఆ స్ఫూర్తితోనైనా ఆయన ఈ జల్లికట్టు ఉద్య మాన్ని మాన్పిస్తాడేమో అని వెంకయ్య చెప్పాడు. ఏమా సి.డి, ఏమా కథ అని రాజ్‌నాథ్‌సింగ్ అడిగాడు. ఉండండి... పన్నీర్ సెల్వంతో పాటు మీరూ చూస్తారుగా అని వెంకయ్య అన్నాడు.

★★★★★

ప్రధాని కార్యాలయం పిలుపు మేరకు పన్నీర్ సెల్వం బాగా తక్కువ ఛార్జీ వున్న ఫ్లైట్ ఎక్కి ఢిల్లీ చేరుకున్నాడు. వెంకయ్య ఇంట్లో ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు ఈయన రాక కోసమే ఎదురుచూస్తున్నారు. పన్నీర్ సెల్వం రాగానే... మోడీ వుండి... జల్లికట్టుపై అంత పంతమేంటి, అదేదో డెవలప్‌మెంట్ మీద చూపిస్తే బాగుంటుంది కదా అని అన్నాడు. మాకు సంప్రదాయాలు ప్రాణం, మేం ప్రాణాలైనా వదులుకుంటాంగాని సంప్రదాయాలను వదిలే ప్రసక్తేలేదని పన్నీర్ సెల్వం ఖరాఖండీగా చెప్పాడు. పరిస్థితులకు తగ్గట్లుగా మనం రాజీపడిపోతుండాలి, అదెలాగో ఇదిగో ఈ సి.డి చూస్తే నీకే అర్ధమవుతుందంటూ వెంకయ్య ఒక సి.డిని తీసి సి.డి ప్లేయర్‌లో పెట్టి టీవీని ఆన్ చేశాడు.

★★★★★

అది ప్రధాని ఛాంబర్... మోడీ, అరుణ్‌జైట్లీ, వెంకయ్యలు వున్నారు. విభజన చట్టంలో ఏపికి ప్రత్యేకహోదా ఇస్తామన్నారు. దానికి మనం కూడా మద్దతు పలికాం. కాని ఇప్పుడు ఏపికి ప్రత్యేకహోదా ఇస్తే ఇంకా కొన్ని రాష్ట్రాలు ప్రత్యేకహోదాకు డిమాండ్ చేసే అవకాశముంది. ఏపికి ప్రత్యేకహోదా ఇవ్వకపోతే పోలేదా అని మోడీ అన్నాడు. అందుకు వెంకయ్య... భలేవార్సార్, విభజన చట్టంలో పెట్టిన దానిని మనం ఎలా కాదంటాం. అదీగాక ఆ చంద్రబాబు అసలే చంఢశాసనుడు. ప్రత్యేకహోదా ఇవ్వకుంటే రాష్ట్రమంతటా ఉద్యమాన్ని రగిలిస్తాడు. తెలుగు ప్రజలు పౌరుషానికి ప్రతీకలు, ఖడ్గతిక్కన, మనుమసిద్ధి మహారాజు, రుద్రమదేవి, కృష్ణదేవరాయులు, తాండ్ర పాపారాయుడు, శాతకర్ణి వంటి వాళ్ల చరిత్ర చూడండి... వాళ్లకు చంద్రబాబుకు ఏ మాత్రం తేడా లేదు. తెలుగువాడి ఆత్మగౌరవం నుండి పుట్టిన పార్టీ తెలుగుదేశం. ఆ ఆత్మగౌరవాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేయవద్దు. చంద్రబాబుకు మండిందంటే భారతదేశమే అగ్నిగుండమవుతుంది. ఆంధ్రప్రదేశ్ అంతటా ప్రళయమొస్తుంది. నిప్పుతో ఆట చంద్రబాబుతో వేట ఒకటే... అని వెంకయ్య చెప్పాడు. అరుణ్‌జైట్లీ అందుకుని... ఏపికి ప్రత్యేకహోదా ఇస్తే లేనిపోని సమస్యలు వచ్చేటట్లున్నాయి. ఏపికి మంచి ప్యాకేజీ ఇస్తే ఒప్పుకుంటాడా అని అడిగాడు. ష్... గట్టిగా అరవకు... చంద్రబాబు బయటే కూర్చుని వున్నాడు. ప్రత్యేకహోదా మీద తాడోపేడో తేల్చుకుందామని వచ్చాడు. గాలిని కొనగలమా? చంద్రకాంతిని, సూర్యుడి కిరణాలను, సముద్రపు అలలను కొనగలమా? నిప్పును, నీతిని, నిజాయితీని కొనగలమా? అలాగే ప్రత్యేక ప్యాకేజీతో చంద్రబాబు ఆత్మగౌరవాన్ని కొనలేము. ఏపికి ప్రత్యేకహోదా ఇవ్వడం తప్ప మరో మార్గం లేదు. శివుడు మూడో కన్ను తెరచినా, చంద్రబాబుకు ముక్కు మీద కోపం వచ్చినా ప్రళయమే, ఏపికి ప్రత్యేకహోదా ఇవ్వడం తప్ప మరో మార్గం లేదని వెంకయ్య అన్నాడు. సరే, చెప్పక ఇక తప్పదు కదా, ఆ చంద్రబాబును లోపలకు పిలవండని మోడీ అన్నాడు. చంద్రబాబు పి.ఎం ఛాంబర్‌లోకి వచ్చి కూర్చున్నాడు. అరుణ్ జైట్లీ వుండి... ఏపికి ప్రత్యేకహోదా బదులు వేలకోట్లతో ప్రత్యేకప్యాకేజీ ఇద్దామనుకున్నాం... అని అరుణ్‌జైట్లీ మిగతాది చెప్పబోయేలోపే చంద్రబాబు టక్కున ఆయన రెండు చేతులు పట్టుకుని... అబ్బా, నా మనసులో ఉన్నది మీరు కరెక్ట్‌గా చెప్పారు. నేను కూడా ప్రత్యేకప్యాకేజీ కోరదామనే వచ్చాను. ఇప్పటిదాకా మీరు ప్రత్యేకహోదా ఎక్కడ ఇస్తారోనని చెప్పి బయట టెన్షన్‌తో కూర్చున్నాను. నా మనసును మీరు సరిగ్గా అంచనా వేసారు. ప్రత్యేకహోదా వల్ల వచ్చేదేముంది, ప్రత్యేక ప్యాకేజీయే మాకు కావాలి.. థాంక్స్... థాంక్స్... అంటూ అందరికీ కృతజ్ఞతలు చెప్పాడు. ఆ పరిణామానికి మోడీతో పాటు జైట్లీ, వెంకయ్యలు కూడా షాక్‌కు గురయ్యారు. అరుణ్‌జైట్లీ వాస్తవంగా... ప్రత్యేకప్యాకేజీ ఇద్దామనుకున్నాం, మీరు ఒప్పుకోరని చెప్పి ప్రత్యేకహోదా ఇస్తున్నాం అని చెప్పబోయాడు. ఈలోపే చంద్రబాబు ప్రత్యేకప్యాకేజీకి ఫిక్సయ్యాడు. కాగల కార్యం గంధర్వులే తీర్చారని సంబరపడుతూ అరుణ్‌జైట్లీ... ప్రత్యేకహోదా లేదంటే మీ రాష్ట్ర ప్రజలు ఆందోళనలు చేయరా? అని అడిగాడు. అందుకు చంద్రబాబు... మా వాళ్లకు అంత సీన్ వుంటే అసలు రాష్ట్ర విభజన ఎందుకు జరుగుతుంది. మా వాళ్లు ఎలక్షన్లు అప్పుడే బయటకు రావడం కష్టం, ఇక వీటన్నింటికి రోడ్లమీదకొస్తారా? అని అన్నాడు. దాంతో ప్రత్యేకప్యాకేజీ ఒప్పందం కుదిరిపోయింది.

★★★★★

సి.డి దృశ్యాలు అయిపోయాక మోడీ... చూసావా, ఏపి సీఎం ఎంతో ప్రాధాన్యత కలిగిన ప్రత్యేకహోదా అంశాన్ని వదులుకున్నారు. ఈ స్ఫూర్తితో మీరు జల్లికట్టు ఉద్యమాన్ని పక్కనపెట్టలేరా? అని పన్నీర్ సెల్వంను అడిగాడు. అందుకు ఆయన... ఏం చేసేంసార్, ఓట్లేసిన జనాలకు ఏదన్నా చేయాలన్న తపన మాలోనూ, తమిళ జాతికి అన్యాయం జరిగితే దానిని ఎదుర్కొనే రోషం, పౌరుషం మా ప్రజలలోనూ ఇంకా అంతో ఇంతో మిగిలివుంది, అందుకే ఇట్లాంటి రాజీలు మా వల్ల కాదంటూ అక్కడ నుండి లేచాడు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగులకు అధికారుల సహకారం ఆదరణ ఉంటుంది. ఖర్చులు సామాన్యం మరియు ప్రయోజనకరంగా ఉంటాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు దొరుకుతాయి. కుటుంబసభ్యుల అనుకూలత బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో ఇబ్బందులు రాకుండా మెలకువగా నిర్వహిస్తారు. ఆదాయ లోపం ఉండదు. కొత్త పెట్టుబడులు, కొత్త వ్యాపారాలకు అవకాశాలు లభించగలవు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. అనుకున్న పనులను సాధిస్తారు. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, ఉద్యోగార్ధులకు అవకాశాలు దొరుకుతాయి. అల్లులతో తగాదాలు రాకుండా చూచుకొనాలి. వృత్తి నిర్వహణలో తీరిక ఉండదు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి అవకాశాలుండి ఆదాయం పెరుగుతుంది. గౌరవమర్యాదలకు ఖర్చులు చేస్తారు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఉద్యోగులకు పబ్లిక్ నుంచి అధికారుల నుంచి వత్తిడి ఎక్కువగా ఉంటుంది. బంధుముఖ్యుల యొక్క అనారోగ్య వార్తలు వింటారు. సంప్రదింపులు ఒప్పందాలు ఫలించగలవు. సభలు సమావేశాలలో ప్రముఖంగా పాల్గొంటారు. కుటుంబ సౌఖ్యం ఉంటుంది. స్థిరాస్తుల క్రయ విక్రయాలు, కొత్త పెట్టుబడులకు అవకాశాలు లభిస్తాయి. కోర్టు వ్యవహారాలు ఇబ్బందిని కలిగించగలవు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఉద్యోగులకు అధికారుల అనుకూలత, విధి నిర్వహణ బాధ్యతలు పెరుగుతాయి. ఆరోగ్య లోపం స్వల్పంగా బాధిస్తుంది. వ్యాపార భాగస్వామ్యాలకు, పెట్టుబడులకు ఆహ్వానాలు అందుతాయి. సున్నిత విషయాలపై పట్టుదల మాని రాజీ చేసికొనడం మంచిది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి అవకాశాలు బాగుంటాయి. ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

గృహోపకరణాలు, క్రొత్త వస్తువులు కొంటారు. అనుకోకుండా బంధుమిత్రులను కలుసుకొంటారు. స్థిరాస్తుల కొనుగోలు జరుపగలరు. ఉద్యోగులకు అధికారులతో సత్సంబంధాలు నెలకొంటాయి. స్థిరాస్తులపై ఆదాయం, ఆరోగ్యం బాగుంటుంది. కుటుంబసౌఖ్యంపై దృష్టి పెడతారు. ఆకస్మిక ఖర్చులు, పలుకుబడి ప్రాపకాల కొరకు ఖర్చులు అదనంగా ఉంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కుటుంబ వ్యవహారాలలో ఇబ్బందులను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకొనాలి. ఉద్యోగులకు బాధ్యతల మార్పులు, పనిభారం పెరుగుట ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో సమస్యలను అధిగమిస్తారు. శుభకార్యాలు నిర్ణయం కావడం జరుగుతుంది. బంధుమిత్రులు సహాయ పడతారు. కోర్టు కేసులందు అనుకూలత ఉంటుంది. స్థిరాస్తులు, విలువైన వస్తువులు కొంటారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 27.1.2017 నుండి

తేది. 2.2.2017 వరకు

ఈ వారం సింహంలో రాహువు, కన్యలో గురువు, ధనుస్సులో శని బుధులు, మకరంలో రవి బుధులు, మకర కుంభ మీన రాశులలో చంద్రుడు, కుంభంలో కేతువు, మీనంలో కుజశుక్రులు సంచరిస్తారు.

### పంచాంగము

ముహూర్తములు

తేది 29 ఆదివారము ఉదయం గంట 10.54 నుండి గంట 12.0లోగా మేష లగ్నము వివాహవ్యాపారములు.

తేది 1 ఫిబ్రవరి పంచమి బుధవారము రాత్రి 12.45 నుండి 2.55 లోగా వృశ్చిక లగ్నమున గృహప్రవేశ వివాహములు.

### పుష్య మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 27 | శుక్ర | అమావాస్య | రా॥ గం.5.59వ॥ |

### మాఘమాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 28 | శని | పాడ్యమి | పూర్తిగ |
| తేది. 29 | ఆది | విదియ | రా॥ గం.5.59వ॥ |
| తేది. 30 | సోమ | తదియ | రా॥ గం.5.10వ॥ |
| తేది. 31 | మంగళ | చతుర్ధి | రా॥ గం.4.0వ॥ |
| తేది. 1 | బుధ | పంచమి | రా॥ గం.2.20వ॥ |
| తేది. 2 | గురు | షష్ఠి | రా॥ గం.12.28వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

శుభకార్యాలలో పాల్గొంటారు. స్థిరాస్తుల లావాదేవీలలో తొందరపాటు మానుకొనండి. రావలసిన బాకీలు నిలబడిపోవడం, కోర్టు కేసులు వాయిదా పడటం జరుగుతుంది. ఇచ్చిన మాట నిలబెట్టుకొనలేక విమర్శలు ఎదుర్కొంటారు. డబ్బు ఖర్చులు పెట్టిగాని అనుమతులు పొందలేరు. ముఖ్య వ్యవహారాలలో సంప్రదింపులు జరిపి నిర్ణయాలు తీసుకొనండి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

పిల్లల వల్ల మానసికాందోళన ఉంటుంది. ఇతరుల పనులు కొరకు ప్రయాణాలుంటాయి. ఉదరకోశ రుగ్మతలుంటాయి. ఉద్యోగులు అధికారులతోను ప్రజలతోను జాగ్రత్తగా మెలగండి. హామీలు మధ్యవర్తిత్వాలకు దూరంగా ఉండండి. నిరుద్యోగులకు అవకాశాలుండక పోవచ్చును. సభలు సమావేశాలలో ప్రముఖంగా వ్యవహరిస్తారు. ఆర్ధిక కార్యక్రమాలను జాగ్రత్తగా నిర్వహించండి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఉద్యోగులకు అధికారులకు పని సామర్ధ్యం గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. ఉద్యోగార్ధులకు అవకాశాలు లభించగలవు. ఆరోగ్య లోపం కొద్ది ఇబ్బంది పెడుతుంది. సభలు సమావేశాలలో ప్రముఖంగా పాల్గొంటారు. దూర ప్రయాణాలుంటాయి. శాస్త్ర సాంకేతిక రంగాల వారికి ప్రభుత్వ సహకారముంటుంది. స్థిరాస్తులు, విలువైన వస్తువులు కొనడం జరుగుతుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

భాగస్వామిక వ్యవహారాలలో ప్రముఖపాత్ర వహించడం, దూర ప్రయాణాలు చేయడం ఉంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు జరుపుతారు. కోర్టు వ్యవహారాలలో కొంత ఉపశమనం ఉంటుంది. బాకీలు, ఇతరత్రా రావలసిన డబ్బు అందుకొనగలరు. వృత్తి ఉపాధి పథకాలందు నిలద్రొక్కుకుంటారు. వ్యాపారవృద్ధికి నూతన పెట్టుబడులకు వనరులు సమకూరుతాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కోర్టు వ్యవహారాలు ఇబ్బంది పెట్టగలవు. బాకీలు వసూళ్ళు నిలబడిపోతాయి. ఉద్యోగులు అధికారులతో పబ్లిక్‌తో జాగ్రత్తగా మెలగండి. బంధుముఖ్యుల అనారోగ్య వార్తలు వింటారు. ఉద్యోగార్ధులకు అవకాశాలు దొరకగలవు. శుభకార్య ప్రయత్నాలు చేసేవారికి అనుకూలత ఉంటుంది. అదనపు ఖర్చులు హఠాత్తుగా పైనబడగలవు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆరోగ్యం బాగుంటుంది. పెట్టుబడులకు, కొత్త వ్యాపారాలకు తగిన సమయమిది. ఉద్యోగులకు అధికారుల వద్ద గుర్తింపు ఆదరణ ఉంటుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. కళ క్రీడా సాంకేతిక రంగాల వారు బాగా రాణిస్తారు. ప్రభుత్వ అనుమతులు దొరకడం, దైవ కార్యాలను నిర్వహించడం, వాయిదా పడిన పనులు పూర్తి చేయడం జరుగుతుంది. ఆదాయం బాగుంటుంది.

# రాజసంగా రాజగోపురం పూజలు



దక్షిణకాశిగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి పట్టణంలో దాదాపు 1516వ శతాబ్దంలో అప్పటి పల్లవ, చోళరాజులు రాజగోపురం నిర్మించారు. అప్పటి రాజగోపురం (గాలిగోపురం)గా పిలువబడుతూ వచ్చింది. అలాంటి చారిత్రాత్మక గాలిగోపురం 2010వ మే 26వ తేదిన ఆకస్మాత్తుగా కూలిపోయింది. అప్పటి నుంచి ఒక సంవత్సరం వరకు ఎలాంటి కార్యక్రమాలు చేయలేదు.

2014 సంవత్సరంలో ముఖ్యమంత్రి కె.రోశయ్య హయాంలో ఈ రాజగోపుర పునఃనిర్మాణానికి నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ ముందుకొచ్చింది. వారు వెంటనే పనులు ప్రారంభించి 2016వ సంవత్సరం డిసెంబర్ 21వ తేదీ నాటికి రాజగోపురం నిర్మాణాన్ని పూర్తి చేశారు. రాజగోపురం నిర్మించేందుకు సుమారు రూ.40 కోట్లు ఖర్చుయినట్లు తెలిసింది. జనవరి 19వ తేది నుంచి శ్రీకాళహస్తి పట్టణంలో ఉన్న రాజగోపురం వద్ద లోకకళ్యాణార్థం విశ్వకళ్యాణ శాంతి మహాయజ్ఞాలను నవయుగ నిర్మాణ సంస్థ అధినేతలు విశ్వేశ్వరరావు వారి కుమారులు శశిధర్, శ్రీధర్‌లు కలిసి నిర్వహిస్తున్నారు. 12 రోజులపాటు నిర్వహిస్తున మహాయజ్ఞంలో మొదటి రోజు మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య, కంచికామకోటి పీఠాధిపతులు విజయేంద్ర సరస్వతి, అవధానులు నాగఫణిశర్మ, పి.వి.ఆర్.కె. ప్రసాద్‌లు హాజరై పాల్గొని భక్తులనుద్దేశించి ప్రసంగించారు.

కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వాములవారు మాట్లాడుతూ గాలిగోపురం కట్టించడమనేది చాలా గొప్ప విషయమన్నారు. నవయుగ కన్‌స్ట్రక్షన్స్ అధినేత చింతా విశ్వేశ్వరరావు వారి కుమారులు చింతా శ్రీధర్, చింతా శశిధర్ వారి అల్లుడు అందరూ కలసి రాజగోపుర నిర్మాణంలో చాలా కృషి చేశారన్నారు. పంచభూతలింగాల్లో శ్రీకాళహస్తిలో వెలసిన శ్రీ జ్ఞానప్రసూనాంబ జ్ఞానానికి, ముక్తికి పుణ్యక్షేత్రం అన్నారు. సాలెపురుగు, పాము, ఏనుగు మూడు జీవరాశులు కలిసి తపస్సు చేయడం వల్ల శ్రీకాళహస్తి అనే పేరు వచ్చిందన్నారు.

మూడో రోజు సినీ స్టార్, రాజ్యసభ సభ్యులు శివశంకర వరప్రసాద్ (చిరంజీవి) విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కూలిపోయిన రాజగోపురాన్ని పునః నిర్మించడం దక్షిణ భారతదేశానికే ప్రత్యేక గుర్తింపుగా ఉందన్నారు. విశ్వకళ్యాణ శాంతి మహాయజ్ఞం పూజలకు సినీ హీరో చిరంజీవి వారి కుటుంబ సమేతంగా వచ్చి పూజలు నిర్వహించుకున్నారు. గోపురం వద్ద ఆయనకు నవయుగ సంస్థ అధినేత చైర్మన్ చింతా విశ్వేశ్వరరావు వారి కుమారులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం యాగశాలలను దర్శించి గోపురంలో ప్రతిష్ఠించిన శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివయ్యను కీర్తిస్తూ చిరంజీవియే స్వయంగా శంఖానాదం చేశారు. రెండు నెలల క్రితమే చింతా విశ్వేశ్వరరావు గోపురం నిర్మాణం పూర్తయిందని, హోమపూజలకు రావాలని పిలిచారన్నారు. తనను సర్వేశ్వరుడే విశ్వేశ్వరరావు రూపంలో పిలిచారన్న ఆనందంతో ఇది పూర్వజన్మ సుకృతంగా భావించానన్నారు. గోపుర నిర్మాణమంటే తరాలు సంవత్సరాలు గడిచిపోతాయని అలాంటి అద్భుత గోపుర నిర్మాణాన్ని నవయుగ నిర్మాణ సంస్థ అనుకున్న సమయంలో నిర్మించడం చాలా హర్షణీయమన్నారు. రాజగోపురం శ్రీకాళహస్తి పట్టణానికి చాలా గర్వకారణమన్నారు. పట్టణానికే కాకుండా ఆంధ్రప్రదేశ్ , దక్షిణ భారతదేశంలోనే ఇదొక ప్రత్యేక గుర్తింపు అన్నారు. రాజగోపురాన్ని నాడు శ్రీకృష్ణదేవరాయులు నిర్మిస్తే, అదికూలిపోతే దాని స్థానంలోనే నేడు నేటి పూర్వ వైభవాన్ని చాటుతూ నిర్మింపజేసిన చింతా విశ్వేశ్వరరావును అభినవ శ్రీ కృష్ణదేవరాయులుగా కొనియాడడంలో అతిశయోక్తి లేదన్నారు. నేటమట్టమైన గోపురాన్ని చూశాను. దీన్ని ఏవిధంగా తిరిగి నిలబెట్టాలని నాడు మధనపడ్డామనీ, నాటి ముఖ్యమంత్రి రోశయ్య ఆధ్వర్యంలో చర్చలు జరుగుతుండగా విశ్వేశ్వరరావు వచ్చి ఎన్ని కోట్లు అయినా భరించి నిర్మింపజేస్తానంటూ ముందుకు రావడం సమాజానికి చాలా గర్వకారణమన్నారు. సమాజానికి ఏం చేస్తామనేదే స్ఫూర్తిగా ముందుకు వచ్చారన్నారు.

పరమహంస పరివ్రాజకులు కాకినాడ శ్రీ పీఠాధీశ్వరులు పూజ్యశ్రీ పరిపూర్ణానందస్వామి మాట్లాడుతూ శని మహర్దశ వల్ల గత రెండున్నర ఏళ్ళ కాలంలో లోకానికంతటికీ కీడు చేకూరిందని అయితే జూన్ 26తో శని ప్రభావం తొలగిపోతుందన్నారు. సమాజం మనకు ఏం చేసిందని కాదు, సమాజానికి మనం ఏం చేశామన్నది కూడా ఎంతో ముఖ్యమన్నారు. మనిషి ప్రయాణం సామాన్యం నుంచి అసామాన్యం వరకు ఉంటుందన్నారు. పుట్టినప్పుడు ఎవరూ స్వతంత్రులు కాదన్నారు. అమ్మ మాటకోసం తాను సన్యాసం స్వీకరించానన్నారు. కాషాయం కోసం “అమ్మ” ప్రేమను వదులుకోలేనన్నారు. అమ్మా నాన్నలే తనకు ఎంతో ముఖ్యమన్నారు. తన పూర్వీకులది కర్నాటక అయినా... తాను పుట్టింది మాత్రం నెల్లూరు జిల్లాలోనే అన్నారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి సతీమణి సురేఖ, కుమార్తె శ్రీజ, అల్లుడు, కృష్ణపట్నం సి.ఇ.ఓ. యెండ్లూరి అనిల్, మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్, బీజేపీ నాయకులు కోలా ఆనంద్, వైయస్ఆర్ నాయకులు అంజూరు తారకశ్రీనివాసులు, సమన్వయకర్త డాక్టర్ ఆమంచి బాలసుధాకర్ శాస్త్రి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### 1న రాజగోపురం కుంభాభిషేకం

దక్షిణకాశిగా ప్రసిద్ధిచెందిన శ్రీకాళహస్తి రాజగోపురానికి ఫిబ్రవరి 1వ తేదీన కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారిణి డి.భ్రమరాంబ, ట్రస్టుబోర్డు చైర్మన్ పోతుగుంట గురవయ్య నాయుడు, సభ్యులు తెలిపారు. అలాగే 8వ తేదిన ఆలయ మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున, భక్తులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

## శ్రీకాళహస్తి న్యూస్





విశ్వశాంతి మహాయజ్ఞంలో హోమాల్లో పాల్గొన్న చిరంజీవి కుటుంబ సభ్యులు





## కావలి కబుర్లు





## ‘టైక్వాండో’ విజేతలకు అభినందన

గత నెల 27,28,29 తేదీల్లో కలకత్తాలో జరిగిన అంతర్జాతీయ టైక్వాండో పోటీలలో పతకాలు సాధించిన విద్యార్థులకు కావలి రెడ్‌క్రాస్ భవనంలో ఈ నెల 24న అభినందన సభ జరిగింది. రెడ్‌క్రాస్ రక్తనిధి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. బి.రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కావలి సబ్‌డివిజినల్ పోలీసు అధికారి రాఘవరావు, 2వ పట్టణ సిఐ శ్రీనివాసరావు, కావలి రూరల్ సిఐ అశోక్‌వర్ధన్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ డి. సుధీర్‌నాయుడు, రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షులు తన్నీరు మాల్యాద్రి, గంధం ప్రసన్నాంజనేయులు తదితరులు పాల్గొని టైక్వాండో విజేతలను అభినందించారు. సబ్‌జూనియర్ విభాగంలో బంగారు పతకం సాధించిన ఎస్.సుహేల్‌ను డిఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ, ప్రపంచపటంలో కావలికి గుర్తింపు తెచ్చారంటూ పతక విజేతలను కొనియాడారు. అనంతరం పతక విజేతలు ఎస్‌డి సుహేల్‌తో పాటు, ఇ.జేమ్స్, ఎస్.కె వాజిద్, ఎం.అజయ్, పి.మోహన్ తదితరులకు జ్ఞాపికలు బహుకరించారు. టైక్వాండో గురువు గ్రాండ్‌మాస్టర్ రవిగన్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి డి.రవిప్రకాష్, నిర్వహణాధికారి బి.ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### పోలీస్ అవుట్ పోస్ట్ మూత...

## ఈవ్‌టీజింగ్ షురూ..




కావలి పట్టణం కోఆపరేటివ్ కాలనీ కళాశాలలకు నిలయమైన ప్రాంతం. చదువుకునేందుకు వచ్చే విద్యార్థినులను ఆటపట్టించేందుకు ఆకతాయిలు, పలు కళాశాలల విద్యార్థులు అక్కడికి చేరుకుని ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్నారు. ఈ పరిస్థితిని విద్యార్థినులు ఎవరికి చెప్పుకోలేక మదనపడిపోతున్నారు. పేరొందిన ఎం.ఎస్.ఆర్ డిగ్రీ కళాశాల, శ్రీసాయి, సాయి కో-ఆపరేటివ్ జూనియర్ కళాశాల, స్నేహ, శ్రీచైతన్య డిగ్రీ కళాశాలు ఉన్నాయి. నిత్యం వేలాది మంది విద్యార్థులు కళాశాలలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఇంతే స్థాయిలో ఈవ్‌టీజింగ్ శృతిమించడాన్ని కళాశాల యాజమాన్యాలు గుర్తించాయి. పోలీసు బందోబస్తు కోరుతూ డిఎస్పీ రాఘవరావుకు విన్నవించడంతో ఆయన సూచనలతో కళాశాలల కూడలిలో ఎంతో అట్టహాసంగా పోలీస్ అవుట్ పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం కళాశాలకు విద్యార్థులు వచ్చి పోయే సమయంలో ఇక్కడ పోలీసులను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. ఆరంభం శూరత్వం అన్న చందంగా కొద్ది రోజులు కానిస్టేబుల్‌ను నియమించిన కావలి పోలీసుశాఖ తరువాత పట్టించుకోలేదు. దీంతో ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్ట్ మూతపడగా యధావిధిగా ఈవ్‌టీజింగ్, బైక్ రైడింగ్‌లు, చెట్లకింద విద్యార్థినుల కోసం కాపుకాసి ఉండడం కొనసాగుతోంది. రైల్వే ట్రాక్‌వెంబడి వీధిలో ఈ పరిస్థితి అధికంగా ఉంది. ఇక్కడే విద్యార్థినుల వసతిగృహాలు ఉండడంతో రాత్రిళ్లుసైతం ఆకతాయిలు ఇక్కడికి వస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటికైనా పోలీసుబాసులు మూతపడిన అవుట్ పోస్ట్‌ను తెరిపించి ఇక్కడ కానిస్టేబుల్‌ను నియమించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# కిషోర్స్ రత్నం విద్యార్థుల ప్రతిభ



నెల్లూరు గాయత్రీనగర్‌లో వున్న డాక్టర్ కిషోర్స్ రత్నం స్కూల్ విద్యార్థులు వ్యాసరచన, చిత్రలేఖనం, అబాకస్, హ్యాండ్‌రైటింగ్ పోటీల్లో ప్రతిభ చూపారని జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు తెలిపారు. ఆ స్కూల్లో మంగళవారం నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ, చెన్నై గో స్మార్ట్ సంస్థ ఎసెంట్ పేరుతో నిర్వహించిన పోటీల్లో జోనల్ విజేతలుగా తమ స్కూల్‌కు చెందిన పర్ణిక (1వ తరగతి), తేజేష్‌వర్మ (5వ తరగతి), ఆమని (6వ తరగతి)తో పాటు, ఇంటర్‌స్కూల్ విజేతలుగా అయిదుగురు, స్కూల్ విజేతలుగా ఏడుగురు రాణించారని తెలిపారు. వారందరినీ ఈ సందర్భంగా ఆయన అభినందించారు. స్కూల్ డైరెక్టర్లు డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతి, ప్రధానోపాధ్యాయురాలు ప్రపూర్ణ, విమల తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.

# మలుపులు తిరుగుతున్న ఇఫ్కో

కొడవలూరు మండలం రాచర్లపాడు వద్దగల ఇఫ్కో కిసాన్‌సెజ్ భూముల వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. 1996లో ఇఫ్కో ఎరువుల కర్మాగారం కోసమని ఇక్కడ 2,776 ఎకరాల భూమిని సేకరించడం తెలిసిందే! అయితే ఇఫ్కో రాలేదు. వై.యస్. హయాంలో నిరుపయోగంగా వున్న ఈ భూముల్లో ఇఫ్కో కిసాన్‌సెజ్ తలపెట్టారు. ఈమేరకు ఆయన శంకుస్థాపన కూడా చేశారు. ఇఫ్కో కార్యాలయం ఏర్పాటు కావడంతో పాటు, భూముల చుట్టూ కాంపౌండ్ వాల్ కూడా కట్టారు. అక్కడ కిసాన్‌సెజ్ కదలిక మొదలయ్యే సమయంలోనే వై.యస్. మరణించడంతో మళ్ళీ పాత పరిస్థితే పునరావృతమైంది. ఇది కిసాన్ సెజ్, ఇందులో వ్యవసాయ సంబంధిత పరిశ్రమలు రావాలి. కాని ఇఫ్కో వాళ్ళు గమేషా, కోకోకోలా వంటి కాలుష్య కారక పరిశ్రమలకు భూములు కేటాయించారు. దీని వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం లేకుండా పోలేదు. ఇఫ్కో సెజ్‌లో కాలుష్య పరిశ్రమలను పెట్టడాన్ని నిరసిస్తూ, ఈ భూములను తిరిగి రైతులకే అప్పగించాలంటూ స్థానిక రైతు సంఘాల నాయకులు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన ఉన్నత న్యాయస్థానం, దీనికి సంబంధించిన భూముల వివరాలను సమర్పించాలంటూ కావలి ఆర్డీఓను ఆదేశించడం, ఈ మేరకు కొడవలూరు తహశీల్దార్ భూముల వివరాలను కోర్టుకు సమర్పించడం జరిగింది.

కాగా, తాజాగా ప్రభుత్వం కొత్త ఎత్తు వేస్తోంది. ఇఫ్కో పరిధిలో వున్న ఈ 2,776 ఎకరాల భూములను ఏపిఐఐసికి బదలాయించాలని చూస్తోంది. ఏపిఐఐసి పరిధిలో అయితే యధేచ్ఛగా ఏ పరిశ్రమలైనా పెట్టుకోవచ్చు. చట్టపరంగా అడ్డంకులుండవని ప్రభుత్వం ఆలోచన!



ఈ నెల 25వ తేదీన గూడూరు సిఆర్ మార్డ్ ఫంక్షన్‌హాల్లో 'ఈ పాస్ స్వైపింగ్ మిషన్' పై పోలీసు శాఖ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ, పక్కన డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్, ఎస్‌బిఐ మేనేజర్ శ్రీకాంత్, కె.సునీల్‌కుమార్

# పిలవని పేరంటం

(మొదటి పేజీ తరువాయి)

దావోస్ సదస్సుకు వెళ్లేందుకు ఆయన ఇన్విటేషన్‌ను కొనుక్కుని మరీ వెళ్లారంట! భారత కరెన్సీ ప్రకారం 3కోట్ల 70లక్షలు కట్టి చంద్రబాబు ఆ సదస్సులో పాల్గొన్నాడని సమాచారం. చంద్రబాబు సొంత సొత్తు కాదు. రాష్ట్ర ప్రజల సొమ్ము. కేవలం బిల్డప్ కోసమే ఆయన దావోస్‌కు పోయినట్లు తెలుస్తోంది. ఇంతకుముందు ఆయన కొడుకు లోకేష్ కూడా అమెరికాలో పాతిక లక్షలు కట్టి ఒబామాతో ఫోటో తీయించుకున్నాడు. ఆ ఫోటోను చూపి తెలుగుదేశం నాయకులు ఒబామానే ఎంతో ముచ్చటపడి లోకేష్‌తో ఫోటో దిగాడన్నంతగా ప్రచారం పుట్టించారు. ఇప్పుడు చంద్రబాబు దావోస్ పర్యటన కూడా అలాంటిదే! 2014లో అధికారంలోకి వచ్చింది మొదలు కేంద్రంతో సంప్రదించకుండానే చంద్రబాబు చాలా దేశాలు తిరిగాడు. వివిధ దేశాల ప్రతినిధులతో చర్చలు జరిపాడు. ప్రత్యేక విమానాలు, ప్రయాణాలకే కోట్ల రూపాయలు తగలేసారు. ఆయన విదేశీ పర్యటనలకు ప్రతిఫలంగా ఇంతవరకూ ఒక్కటంటే ఒక్క ప్రాజెక్ట్ కూడా ఏపికి రాలేదు.

# మినిష్టర్... డోంట్ కేర్!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వంలో ఇంతటి కీలకంగా వుండి, ప్రతిఒక్కరూ గౌరవిస్తున్న మంత్రి నారాయణకు ఒక వ్యక్తి మాత్రం మింగుడు పడడం లేదు. అందరూ నారాయణను మంత్రిగానే చూస్తున్నా, అతను మాత్రం ఒకప్పుడు పిల్లలకు చదువుచెప్పిన నారాయణ గానే చూస్తున్నాడు. అతని దృష్టిలో నారాయణ మినిష్టర్‌గా కంటే లెక్చరర్‌గానే ఎక్కువ ముద్ర పడ్డట్లున్నాడు. అతడే నెల్లూరు మేయర్ అజీజ్. నారాయణను అతను ఏ మాత్రం లెక్కచేయడం లేదు. నీ మాట నాకు డోంట్ కేర్ అంటున్నాడు. పార్టీలో అజీజ్ దెబ్బకు నారాయణ అబ్బా అంటున్నాడు. ఈ తలనొప్పిని కొనితెచ్చుకున్నానని బాధపడుతున్నాడు.

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ తరపున గెలిచి మేయర్‌గా ఎన్నికైన అజీజ్‌ను నారాయణే తెలుగుదేశంలోకి తీసుకొచ్చుకున్నాడు. ఇందుకోసం నారాయణ సొంత పార్టీ వాళ్లకు కూడా ద్రోహం చేశాడు. ఎవరి మీద కోపంతో అజీజ్‌ను నెత్తికెక్కించుకున్నాడో? తీరా ఇప్పుడు చూస్తే జిల్లాలోనే కాదు, రాష్ట్రంలోనే నారాయణ మాటను ఏ మాత్రం ఖాతరు చేయని వ్యక్తిగా అజీజ్ ఒక్కడే కనిపిస్తున్నాడు. నారాయణ అంటే అతనికి లెక్కేలేదు. తన పనికి అడ్డమొస్తే నిర్మొహమాటంగా నారాయణనే కడిగేస్తున్నాడు. ఇటీవల నెల్లూరులోని తన ఇంట్లో సమావేశం నిర్వహించినప్పుడు అజీజ్‌ను నువ్వు జీరోవంటూ నారాయణ ఏదో అనబోయాడు. వెంటనే అజీజ్ అడ్డంగా మాట్లాడేసాడు. ఐయామ్ అజీజ్, ఐయామ్ నాట్ జీరో అంటూ మంత్రి మొహం మీద కొట్టినట్లే మాట్లాడాడు. తాజాగా మంత్రి నారాయణ లండన్ పర్యటనకు వెళ్లేరోజున ఫోన్‌లో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలుస్తోంది. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు విడుదలైనా పనులు ప్రారంభం కాకపోవడంపై మంత్రి ఆగ్రహించాడు. ఎస్సీ సబ్‌ప్లాన్ పనుల విషయమై మంత్రి ఫోన్‌లోనే మేయర్ అజీజ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, ఓఎస్‌డి పెంచలరెడ్డిలతో సమీక్ష నిర్వహించారు. ఈ సమయంలో ఎస్సీ సబ్‌ప్లాన్ పనులను నెల్లూరు నగర, రూరల్ ఇన్‌ఛార్జ్‌లకు చెప్పి కేటాయించాలని మంత్రి చెప్పిన కండీషన్‌పై అజీజ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. నేను మేయర్‌ను, కార్పొరేషన్ పరిధిలో నేనే రాజును. ఏ పనులు ఎక్కడ కేటాయించాలన్నది నేనే చూసుకుంటాను, ఇందులో మీ జోక్యం అనవసరం అన్నట్లుగా మంత్రికి అర్ధమయ్యేలా చెప్పాడని తెలిసింది. అవసరమైతే పదవికి రాజీనామా చేసిపోతాగాని, ఇన్‌ఛార్జ్‌లను సంప్రదించి ప్రతి పనిని వారికి చెప్పి చేయలేనని ఆయన మంత్రితోనే ఖరాఖండీగా చెప్పినట్లు సమాచారం.

అజీజ్ వైఖరితో నారాయణ తలపట్టుకునే పరిస్థితి వచ్చింది. నెల్లూరు నగర పాలక సంస్థలో జరిగే అభివృద్ధి పనుల వల్ల పరోక్షంగా తెలుగుదేశం పార్టీ బలపడాలి. కాని ఇక్కడ చూస్తే కార్పొరేషన్‌లో చోటు చేసుకున్న అవినీతి మూలంగా తెలుగుదేశం నష్టపోతోంది. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోకి నెల్లూరు నగరం, రూరల్ అసెంబ్లీలు వస్తాయి. పార్టీకి అసెంబ్లీలు చాలా కీలకం. కార్పొరేషన్‌లు, మున్సిపాల్టీలు, లోక్‌సభ స్థానాల కంటే అసెంబ్లీలో గెలుపే ముఖ్యం. రెండు అసెంబ్లీలలో పార్టీ బలపడాలంటే ఖచ్చితంగా ఇక్కడ ఇన్‌ఛార్జ్‌ల మాటను అనుసరించేపోవాలి. నియోజకవర్గాల పరిధిలో ఎక్కడ ఏమేం చేయాలన్నది వారికే తెలుస్తుంది. కాబట్టే నారాయణ ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల పనులను 80శాతం ఈ రెండు నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లకు అప్పగించి, మిగతా 20శాతం పనులు నీ ఇష్టం వచ్చినట్లు చెయ్... అని అజీజ్‌కు చెప్పాడు. కాని, అజీజ్ దానిని చెవికెక్కించుకోడు. కార్పొరేషన్ పనులతో ఇన్‌ఛార్జ్‌లకేం సంబంధమన్నది ఆయన వాదన. ఆయనకు పార్టీ బలపడితే ఏంటి? బలహీనపడితే ఏంటి? తెలుగుదేశం పార్టీని బలోపేతం చేద్దామని, చంద్రబాబు నాయకత్వాన్ని బలపరుద్దామని చెప్పి ఆయనేమన్నా పార్టీలో చేరాడా? ఇక్కడ అధికారం వుంది కాబట్టి చేరాడు. రేపు ఈ పార్టీ అధికారం కోల్పోతే ఇంకో పార్టీలోకి పోతాడు. పార్టీ గురించి ఆయనెందుకు ఆలోచిస్తాడు. పార్టీ గురించి నారాయణకో, సోమిరెడ్డికో వున్నంత దురద ఆయనకెందుకుంటుంది. అయినా ఇంట్లో పిల్లోడిని తరిమేసి, వీధిలో పిల్లోడిని తెచ్చి పెట్టుకుంటే ఇలాగే ఉంటుంది నారాయణా!

# రవాణా శాఖకు రూ.30లక్షలు ఆదాయం

నెల్లూరు రవాణాశాఖకు రూ.30.39 లక్షల ఆదాయం లభించింది. ఎలాంటి పత్రాలు లేకుండా తిరుగుతూ రవాణాశాఖాధికారుల తనిఖీల్లో పట్టుబడిన వాహనాలను ఆదివారం నెల్లూరు రవాణాశాఖ కార్యాలయంలో వేలం నిర్వహించారు. మొత్తం 125వాహనాలకు గాను 118వాహనాలను వేలం ద్వారా పాటదారులు దక్కించుకున్నారు. స్క్రాప్ క్రింద వేలం వేసిన వాహనాలకు 14.5ట్యాక్స్ క్రింద రూ.5లక్షలు వాణిజ్యపన్నుల శాఖకు ఆదాయం లభించింది. రవాణాశాఖ ఉపకమిషన్ ఎన్.శివరాంప్రసాద్, ఎంవిఐ ఆదినారాయణ, సూపరింటెండెంట్లు కిషోర్, విజయ్, సాయి పాల్గొన్నారు.

# ఉద్యమానికి ఊపిరి?

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ సాధించుకున్నారు. ఆంధ్రా ప్రజలు ప్రజానాయకులను కాకుండా కాంట్రాక్టర్లను, పారిశ్రామికవేత్తలను, వ్యాపార దిగ్గజాలను చట్టసభలకు పంపించారు. కాబట్టి ఢిల్లీలో వాళ్ల స్వలాభాలు చూసుకున్నారుగాని, రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల భవిష్యత్తు చూడలేదు. కాబట్టే మన రాష్ట్రం ఇలా తగలబడింది.

సరే, మన దరిద్రం కొద్ది విభజన జరిగిపోయింది. విభజన సమయంలో ఏపికి ముష్టి వేస్తున్నట్లు ప్రత్యేకహోదా, పోలవరం ప్రాజెక్ట్ వంటివి హామీ ఇచ్చారు. ఇప్పుడు ప్రధానిగా వున్న పెద్ద మనిషి నరేంద్ర మోడీయే తిరుపతి ప్రచారసభలో ఏడుకొండల వెంకన్న పాదాల సాక్షిగా తాము అధికారంలోకి రాగానే ఏపికి ప్రత్యేకహోదా కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ చేతిలో అన్యాయానికి గురైన ఏపికి సంపూర్ణ న్యాయం చేస్తామన్నారు. వాళ్లు అధికారంలోకి వచ్చారు. తర్వాత ఏమైంది. ఆంధ్రప్రదేశ్‌ను కాంగ్రెస్ గుండెల్లో పొడిచి పారిపోయింది. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఏపి మెడకు నరేంద్రమోడీ తాడు బిగించి లాగి ప్రాణం తీసాడు. ఇదే ఆయన చేసింది. ఆయన వచ్చి ఏపి అభివృద్ధికి ప్రాణవాయువుగా భావిస్తున్న ప్రత్యేకహోదాకు మంగళం పాడేసారు. తాను మాట ఇచ్చాననే స్పృహ కూడా లేకుండా ఆయన ప్రత్యేకహోదాను ఏపికి ఇవ్వకుండా చేసారు.

ఈ విషయంలో తెలుగుజాతి పౌరుషం, ఆత్మగౌరవం నుండి పుట్టిన తెలుగుదేశంపార్టీ అధినేత చంద్రబాబు పాత్రను ప్రశ్నించాలి. ఈయన వైఖరి వల్లే ఏపికి ప్రత్యేకహోదా లేకుండాపోయింది. ఆయన ప్రత్యేకహోదా కంటే ప్రత్యేకప్యాకేజీకే ఎక్కువుగా ఆకర్షితుడయ్యాడు. ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టే ప్రత్యేకప్యాకేజీకి ఎందుకు ఒప్పుకోవాల్సి వచ్చిందనే విషయం ఆయనకే తెలియాలి. పోలవరం జాతీయ ప్రాజెక్ట్. దాని నిర్మాణ బాధ్యత పూర్తిగా కేంద్రానిదే! అలాంటి ప్రాజెక్ట్ కాంట్రాక్ట్‌ను చంద్రబాబు పట్టుబట్టి తీసుకున్నాడు. కేంద్రం బాధ్యతగా చేయాల్సిన పోలవరంను ఈయన నెత్తినపెట్టుకోవాల్సిన అవసరం లేదు. అలాగే కేంద్రం మెడలు వంచి సాధించాల్సిన ప్రత్యేకహోదాపై రాజీపడ్డాడు.

సరే, చంద్రబాబు అంటే రాజీపడ్డాడు. మరి ప్రతిపక్షాలు, ప్రజలు ఏమయ్యారు? ప్రత్యేకహోదాపై జిల్లాకో యువభేరి పెట్టి ప్రతిపక్షనేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి పోరాటం చేసాడు. ప్రత్యేకహోదాపై ప్రభావవంతంగా ఆయన ఉద్యమాన్ని చేయలేకపోయాడు. కేంద్రంతో ఆయనకు ఏం తల నొప్పులుండి ఉద్యమానికి వెనకడుగువేసాడో ఆయనకే తెలియాలి.

ఇక జనసేన అధినేత పవన్ చూస్తే సోషల్ మీడియాలో ట్వీట్లు, సినిమాలో ఫైట్లకు పరిమితం. అప్పుడప్పుడు ఒక సభ పెట్టి తిట్టాల్సిన వాళ్లను తిట్టకుండా, ఇంకెవరినో తిట్టి, నాలుగు రోజుల పాటు మీడియాకు పనిపెట్టి మాయమవడం ఆయన నైజం. రాష్ట్రంలో వామపక్షాలకు కేడర్ లేదు. ఇక రాష్ట్ర ప్రజలు చూస్తే ఎన్నికలప్పుడు పోలింగ్ బూత్‌ల వద్ద కొచ్చి ఓట్లేయడమే గగనం. ఇక వీధుల్లోకి వచ్చి ఉద్యమాలు చేసేంత తీరిక, ఓపిక లేవు. ఇప్పుడున్న ఆంధ్రప్రదేశ్‌ను ఇంకో నాలుగు రాష్ట్రాలుగా నరికినా ఈ రాష్ట్రంలో ఆందోళనలు రావు, ఉద్యమాలు రేగవు.

ఇప్పుడేదో తమిళనాడులో జల్లికట్టు ఉద్యమాన్ని చూసి పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లుగా ప్రత్యేకహోదా ఉద్యమాలంటున్నారు. ఉద్యమం అన్నది మన కడుపు మండినప్పుడు, మన కడుపు మండించినప్పుడు ఆ మంటల్లో నుండి పుట్టాలి. ప్రత్యేకహోదా ఉద్యమం ప్రజల్లోనుండి పుట్టాలి. కాని ఇది పుట్టాల్సిన సమయంలో పుట్టలేదు. ఇప్పుడు తమిళులను చూసి తిరిగి ఊపిరి పోసుకుంది. ఏ మాత్రం నిలబడుతుందో వేచి చూడాలి!

# ఇందుకూరుపేటలో 'శ్రీమంతుడు'

- పుట్టిన ఊరికి ఘనమైన సేవలు
- రూ.65 లక్షలతో పాఠశాల భవనం


జి.వి.కె రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్థులు




*తాను శ్రీమంతుడైనా కన్నవారిని ఏనాడూ విస్మరించక, పుట్టిన ఊరికి విశేషమైన సేవలందిస్తూ, నిరంతరం సమాజసేవలో తరిస్తూ అందరికీ మార్గదర్శకంగా నిలుస్తున్నారు ఇందుకూరుపేటకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ గునుపాటి వెంకటకృష్ణారెడ్డి (జివికె).*

జివికె తన స్వగ్రామమైన ఇందుకూరు పేట మండలంలోని కొత్తూరు గ్రామానికి ఈ నెల 23న విచ్చేశారు. తన తల్లి దండ్రులు గునుపాటి రుక్మిణమ్మ, సుబ్బ రామిరెడ్డి పేరున ఏర్పాటుచేసిన జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో 65 లక్షల రూపాయల సొంతనిధులను వెచ్చించి అత్యద్భుతంగా రూపొందించిన 8 గదుల భవనానికి ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా జివికె మాట్లా డుతూ, తాను పుట్టి పెరిగిన ఈ ఊరును తానెక్కడున్నా మరిచిపోయేది వుండదని, ఈ ఊరు ఎప్పటికీ తన మనసులో పదిలం గానే వుంటుందని అన్నారు. ఈ గ్రామాభి వృద్ధికి తనవంతు సహకారం ఎల్లవేళలా వుంటుందని ఆ గ్రామస్తుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక్కడున్న పాఠశాలను ఇంకా అభివృద్ధిచేస్తామని, పిల్లలు బాగా చదువుకుని ఉన్నతస్థాయిలో అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. మంచి భవిష్యత్తు కోసం పిల్లలంతా కష్టపడి చదువుకోవాలని, విద్యారంగంలో ప్రతిభతో రాణించాలని ఆయన అన్నారు. ఈ కార్య క్రమంలో తహశీల్దార్ నారాయణమ్మ, ఎంపిడిఓ వెంకటేశ్వరరావు, ఎంఇఓ శ్రీహరిబాబు, గ్రామసర్పంచ్ ఈదూరు రమణమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొత్తూరులోని జివికె చిన్మయవిద్యా లయంలో జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో జివికె పాల్గొన్నారు. చిన్నారులు ప్రద ర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన ఎంతో ఉత్సాహంతో తిలకిం చారు. ఈ సందర్భంగా 1.5కోట్లతో నిర్మించనున్న టీచర్స్‌క్వార్టర్స్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆ విద్యాలయం ఛైర్మెన్ కృష్ణమూర్తి, ప్రిన్సిపల్ శైలజ, కరస్పాండెంట్ పసల గీర్వాణి, జివికె బయోసైన్స్ సిఇఓ కంఠపూడి, రవినారాయణరెడ్డి, రమేష్, రామభద్రయ్య, గంభీర్‌లు పాల్గొన్నారు.



# పనుల్లో జాప్యం... ప్రజలకు శాపం

- ఇంజనీరింగ్ అధికారులపై కోటంరెడ్డి ఆగ్రహం

నెల్లూరు నగర పరిధిలో చేపట్టిన పనుల్లో జరుగుతున్న జాప్యం ప్రజలకు శాపంగా మారుతుందని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల ఆయన నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజనీరింగ్ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. నగరంలో మొదలుపెట్టిన పనులను పూర్తి చేయక పోవడంపై తన అసంతృప్తిని వ్యక్తం చేశాడు. ముఖ్యంగా ఇటీవల 'లాయర్'లో ప్రచురించిన మాగుంట లే అవుట్ డ్రైనేజీ నిర్మాణ పనులలో జాప్యాన్ని ఆయన ఇంజనీ రింగ్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ డ్రైనేజీని వెంటనే పూర్తిచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని అధికారులకు సూచించారు. అలాగే ఎస్సీ సబ్‌ప్లాన్ పనులు మంజూరైనా, చేయకపోతుండడంపై ఆగ్రహించారు. రాష్ట్రంలోని అన్ని మున్సి పాల్టీల్లో ఎస్సీ సబ్‌ప్లాన్ పనులు పూర్తయినా, నెల్లూరులో మాత్రం ఇంతవరకు మొదలు కాలేదని, ఈ పనులను వెంటనే ప్రారంభించకుంటే నగరఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్‌తో కలిసి నగరపాలక సంస్థ కార్యాలయంకు తాళాలు వేస్తామని హెచ్చరించారు.



## చెంగాళమ్మ దేవస్థానంలో
# మహాకుంభాభిషేకం

భక్తుల కొంగుబంగారం సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఫిబ్రవరి 7వ తేదీ నుండి 15వ తేదీ వరకు అత్యంత అరుదుగా నిర్వహించే కోటి కుంకుమార్చన, మహాకుంభాభిషేక పూజలు వైభవంగా జరుగనున్నాయి. అమ్మవారి భక్తుడు, దైవచింతనాపరుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శ్రీమతి ప్రశాంతిరెడ్డి దంపతుల సౌజన్యంతో ఈ ఆధ్యాత్మిక వేడుక జరుగనుంది. రాష్ట్రం నలుమూలల నుండి 150మంది సుప్రసిద్ద వేదపండితులు విచ్చేసి ఈ పూజలను నిర్వహించనున్నారు. దేవస్థానంలో జరిగే కోటి కుంకుమార్చన, మహాకుంభాభిషేకము కార్యక్రమాలలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి తరించాలని దేవస్థానం ఛైర్మెన్ ముప్పాళ్ల వెంకటేశ్వర్‌రెడ్డి, ఇ.ఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి కోరుతున్నారు.

# జంక్షన్‌లన్నీ జామ్!

- నెల్లూరు ట్రాఫిక్ మరింత అస్తవ్యస్థం





*వ్యాధిని బట్టి రోగికి ఇంజక్షన్ వేయాలి. అంతేగాని, రోగాన్ని వదిలిద్దామని చేతికొచ్చిన ఇంజక్షన్ వేస్తే రోగం వదలకపోగా మరింత ముదిరే ప్రమాదముంది. నెల్లూరు నగరంలో ట్రాఫిక్ కూడా ఇలాంటిదే! ఈ జిల్లాలో పోలీసులకు శాంతిభద్రతలు సవాల్ కావు. మావోయిజం, గూండాయిజం సమస్య లేదు. ఫ్యాక్షన్, రాజకీయ నాయకుల యాక్షన్ పీడ లేదు. ఈ జిల్లా పోలీసులకు ఉన్న వాటిలో పెద్దపని ఏంటంటే నెల్లూరు నగరంలో ట్రాఫిక్‌ను సరిదిద్దడమే! ఇంటిని చూసి ఇల్లాలిని చూడమన్నారు. ఇల్లు ఎంత చక్కగా వుంటే, ఇల్లాలు అంత సహృదయురాలని అర్థం. అట్లాగే నెల్లూరు నగరంలో ట్రాఫిక్ సిస్టంను చూసి నెల్లూరు పోలీసు పనితీరును అంచనా వేయొచ్చు. పదిహేడేళ్ల క్రితం కొత్తకోట శ్రీనివాసరెడ్డి లాంటి ఎస్పీ కళ్లెర్ర జేసి నెల్లూరులో ట్రాఫిక్‌ను కంట్రోల్‌లో పెట్టారు. ఆ తర్వాత వచ్చిన ఏ ఎస్పీకి కూడా నెల్లూరు ట్రాఫిక్ మాట వినేలేదు. వచ్చిన ప్రతి ఎస్పీ కూడా ట్రాఫిక్ కంట్రోల్‌కు రకరకాల ప్రయోగాలు చేసారు. కాని, అవేవీ పెద్దగా ఫలితాలనివ్వలేదు.*

నెల్లూరులో దాదాపు పాతికవేల ఆటోలు, వందల సంఖ్యలో టౌన్‌బస్సులు, వేల సంఖ్యలో కార్లు, మోటార్ బైక్‌లు, సైకిళ్లు, రిక్షాలు... ఇన్ని వాహనాలు తిరిగేది బోసుబొమ్మ నుండి అయ్యప్పగుడి వరకు ట్రంకురోడ్డుమీదుగా, ఆత్మకూరు బస్టాండ్ నుండి అయ్యప్పగుడి వరకు మినీబైపాస్ మీదుగా, సంతపేట నుండి కొత్తూరు వరకు పొదలకూరురోడ్డు మీదుగానే! నగరంలో ఇవే ప్రధానరోడ్లు. నూటికి 70శాతం ట్రాఫిక్ ట్రంకురోడ్డుమీదే వుంటుంది. ఈ రోడ్డులో ఏ క్షణాన చూసినా ఆటోలు ర్యాలీగా పోతున్నట్లుంటుంది. రహదారులు అసలే ఇరుకు, దీనికితోడు రోడ్ల పక్కనే వున్న వ్యాపార సంస్థల ముందు వాహనాల పార్కింగ్‌తో ఇంకొంత ట్రాఫిక్ సమస్య.

నెల్లూరులో 20ఏళ్ల క్రితం ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ ఉండేది. కెవిఆర్ పెట్రోల్ బంకు, రామలింగాపురం జంక్షన్‌లలో దీనిని అమలు చేశారు. ఇటీవలకాలంలో ఆ ట్రాఫిక్ సిగ్నల్స్ కూడా లేవు. నగరంలో ఎవరిదారి వారిదే అన్నట్లుగా ట్రాఫిక్ అస్తవ్యస్థమైపోయింది. ఎక్కడ పడితే అక్కడ స్టాపింగ్‌లు, రోడ్లపైనే వాహనాల పార్కింగ్‌ల వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

ఇదంతా చాలదన్నట్లు ఈమధ్య పోలీసులు జంక్షన్‌లన్నీ జామ్ చేసేసారు. నాలుగురోడ్లు, మూడురోడ్లు కలిసే కూడళ్ళ వద్ద డివైడర్లు అడ్డంగా పెట్టేసి వాహనాలను ముందుకెళ్లి మలుపు తిప్పుకునేలా చేస్తున్నారు. దీనివల్ల ట్రాఫిక్ రద్దీ తగ్గకపోగా ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతుంది. కె.వి.ఆర్ పెట్రోల్ బంకు సెంటర్‌లో ఓ వైపు డివైడర్లు అడ్డంగా పెట్టారు. దీంతో పోలీస్ ఆఫీసురోడ్డులోకి పోవాల్సిన వాహనాలు సిండికేట్ బ్యాంకు ఎదుట మలుపుతిరగాల్సి వస్తుంది. ఈ సమయంలో అయ్యప్పగుడి వైపు వెళ్లే వాహనాలు, అలాగే అటు వైపు నుండి వచ్చే వాహనాలతో ఇక్కడ ట్రాఫిక్‌జాం అవుతుంది. నెహ్రూ బొమ్మ, అంబేద్కర్ బొమ్మ, గాంధీబొమ్మ, రామలింగాపురం జంక్షన్‌లలో కూడా ఇలాగే డివైడర్లు పెట్టడంతో ట్రాఫిక్ సవ్యంగా సాగకపోగా, ట్రాఫిక్ సమస్యలు మరింతగా పెరుగుతున్నాయి.



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com